www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -218 బుధవారం 25 నవంబర్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts



పంజాబ్‌లో ఒక్కటైన పాత మిత్రులు

తిరిగి ఎన్డీయేలోకి అకాలీదళ్

పచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీతో కలిసి పోటీ

అకాలీదళ్ పార్టీకే సీఎం పదవి: అమిత్ షా

న్యూఢిల్లీ,నవంబర్ 24(ప్రజావినికిడి):

: పంజాబ్‌లో పాత మిత్రులు మళ్లీ కలిశారు. చాలా ఏళ్లు ఎన్డీయేలో కొనసాగి, ఆరేళ్ల క్రితం బయటికి వచ్చిన శిరోమణి అకాలీదళ్ పార్టీ తిరిగి ఎన్డీయే గూటికి చేరింది. అకాలీదళ్ పార్టీ కేంద్రంలో అధికార ఎన్డీయేలో చేరడంతో పాటు, త్వరలో జరగనున్న పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో కలిసి పోటీ చేయనున్నట్టు అకాలీదళ్, బీజేపీ మంగళవారం ప్రకటించాయి. పంజాబ్‌లో బీజేపీ, అకాలీదళ్ పొత్తును 'జాతీయ, భావోద్వేగ బంధం'గా అభివర్ణించాయి. మంగళవారం ఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేంద్ర మిగతాది 2లో...

మూసీ పనుల్లో వేగం పెంచండి

అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం..

జనవరి 2027లో ఫేజ్-1 పనులు ప్రారంభం

హైదరాబాద్: నవంబర్ 24(ప్రజావినికిడి):

మూసీ పునరుజ్జీవం, రేడియల్ రోడ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధిపై ఉన్నతాధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టు మొదటి దశ పనుల పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

మూసీ ప్రాజెక్టు ఫేజ్-1లో భాగంగా హిమాయత్‌సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు 9.20 కిలోమీటర్ల ప్రాంతాన్ని జోన్-1ఏగా, ఉస్మాన్‌సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు 11.8 కిలోమీటర్ల ప్రాంతాన్ని జోన్-1బీగా విభజించి పనులు చేపట్టనున్నట్లు అధికారులు వివరించారు. 2027 జనవరిలో మొదటి దశ పనులు ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ ప్రారంభించినట్లు వెల్లడించారు. మిగతాది 2లో...



వైభవ్ సూర్యవంశీ విశ్వరూపం

: 52 బంతుల్లో డబుల్ సెంచరీ.. 28 సిక్సర్లతో సునామీ..

చాడ్ బోవ్స్ (103 బంతులు) పేరిట ఉన్న వరల్డ్ రికార్డ్ గల్లంతు

ఒకే ఇన్నింగ్స్‌లో 28 సిక్సర్లు బాది ప్రొఫెషనల్ క్రికెట్ హిస్టరీలోనే టాప్

28 బాల్స్‌కు శతకం, 40 బాల్స్‌కు 150 రన్స్, 52 బాల్స్‌కు 200 పూర్తి

14.2 ఓవర్లలోనే యూఏఈపై 7 వికెట్ల తేడాతో భారత్ ఘన విజయం

న్యూఢిల్లీ,నవంబర్ 24(ప్రజావినికిడి):

ప్రపంచ క్రికెట్ చరిత్రలోనే కనీవినీ ఎరుగని సరి
కొత్త విధ్వంసం నమోదైంది. భారత టీనేజ్ సంచలనం వైభవ్ సూర్యవంశీ బంతిని బాదుడే బాదుడు అన్నట్లుగా విరుచుకుపడుతూ పలు అంతర్జాతీయ, దేశవాళీ రికార్డులను తుడిచిపెట్టేశాడు. కేవలం 52 బంతుల్లోనే డబుల్ సెంచరీ (ద్విశతకం) బాది ప్రపంచ వన్డే క్రికెట్‌ను నివ్వెరపరిచాడు. లిస్ట్-ఏ వన్డే చరిత్రలోనే అత్యంత వేగవంతమైన ద్విశతకంగా ఇది చరిత్రకెక్కింది. అంతకుముందు మిగతాది 2లో...



రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని అడ్డుకున్నది కేసీఆరే

బీఆర్ఎస్ హయాంలో నీళ్ల మళ్లింపు లేదు

పాత జీవోలను చూపించి తప్పుదోవ పట్టిస్తున్నారు

700 కి.మీ. దూరంలోని కుప్పానికి కృష్ణా నీళ్లు..

పక్కనే ఉన్న పాలమూరుకు మాత్రం అన్యాయం

సీఎం హోదాలో అబద్ధాలు చెప్తే.. నిజాలైపోవు

ముఖ్యమంత్రిపై బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ధ్వజం



అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ బ్రాండ్ ఇమేజ్ పెంచేలా గ్లోబల్ సమ్మిట్

భారత్ ఫ్యూచర్ సిటీలో సమ్మిట్ ఏర్పాట్లను పరిశీలించిన శ్రీధర్ బాబు

డిసెంబర్ 7 నుంచి 9 వరకు జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026

సమ్మిట్ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు మంత్రి ఆదేశం



ఇంటర్ ప్రాక్టికల్స్‌లో జంబ్లింగ్ విధానం రద్దు



: తెలంగాణ ఇంటర్ బోర్డు నిర్ణయం

విద్యార్థులు తమ సొంత కళాశాలల్లోనే ప్రాక్టికల్ పరీక్షలు రాసే వెసులుబాటు

మొదటి సంవత్సరం విద్యార్థులకు కూడా ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణ

జనవరి 29 నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

ఉదయం 9 నుంచి 12 వరకు.. మధ్యాహ్నం 2 నుంచి 5 వరకు పరీక్షల వేళలు

హైదరాబాద్,నవంబర్ 24(ప్రజావినికిడి):

తెలంగాణలో 2027 ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలకు సంబంధించి తెలంగాణ రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యా మండలి కీలక నిర్ణయం తీసుకుంది. ప్రాక్టికల్ పరీక్షల్లో జంబ్లింగ్ విధానాన్ని మిగతాది 2లో...

పారదర్శకంగా పంచాయతీ ఎన్నికలు

మున్సిపల్ ఫలితాలు రాత్రి 8గంటల్లోగా ఇవ్వాలి

డిసెంబరు 5తో ఎన్నికల ప్రక్రియకు ముగింపు:పునేఠా

రేపే తొలివిడత పంచాయతీ పోలింగ్

మిగిలిన 23 పట్టణ సంస్థలకు కూడా..

ఎన్నికల అధికారులతో ఎస్ఈసీ వర్చువల్ భేటీ

అమరావతి, నవంబర్ 24(ప్రజావినికిడి):

స్థానిక సంస్థల ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్లు, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, నామినేషన్ల పరిశీలన, పోస్టల్ బ్యాలెట్ల నిర్వహణ, శాంతిభద్రతలు తదితర అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మిగతా 2లో...



హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్లకు ఉచిత రిజిస్ట్రేషన్

ఇందిరమ్మ టవర్స్ లబ్ధిదారులకు రూ.50 నుంచి రూ.60 లక్షల ఆస్తి ఇస్తున్నామన్న పొంగులేటి

హైదరాబాద్, : నవంబర్ 24(ప్రజావినికిడి):

హైదరాబాద్ లో పేదలకు సొంతిల్లు అందించే లక్ష్యంతో నిర్మిస్తున్న ఇందిరమ్మ టవర్స్ ద్వారా ఒక్కో లబ్ధిదారుడికి దాదాపు రూ.50 నుంచి రూ.60 లక్షల విలువైన ఆస్తిని సమకూర్చడంతో పాటు, ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వనున్నట్లు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రిమిగతాది 2లో...



ఐదుగురు దుర్మరణం

కార్తీక పౌర్ణమి వేళ భోగాపురం వద్ద విషాదం

ట్యాంకర్ లారీని థార్ ఢీకొట్టడంతో మంటలు..

కుటుంబాలతో కలిసి శ్రీకాకుళం

శ్రీముఖ లింగేశ్వరుని దర్శనానికి వెళ్లిన మిత్రులు

తిరుగు ప్రయాణంలో పెట్రోల్ బంక్ పక్కన

ఆగిన లారీని ఢీకొనడంతో ప్రమాదం..

లారీ కిందకు జీపు-మృతులంతా విశాఖవాసులే..

ఇంటికి తిరిగొచ్చేస్తున్నట్టు పిల్లలతో

ఫోన్‌లో మాట్లాడిన కొద్ది సేపటికే దుర్ఘటన

పెళ్లిరోజే సతీశ్, శ్రుతి దంపతుల దుర్మరణం



తెలుగు రాష్ట్రాల్లో భక్తిపారవశ్యం!

కార్తీక పౌర్ణమి వేడుకలు..

విజయవాడ, శ్రీశైలం, పంచారామ క్షేత్రాల్లో ప్రత్యేక పూజలు

వేములవాడ, భద్రాచలం, వేయిస్తంభాల గుడి వద్ద భక్తుల రద్దీ

అమరావతి,హైదరాబాద్,నవంబర్ 24(ప్రజావినికిడి):

కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ ఇంద్రకీలాద్రి, శ్రీశైలం, రాజమండ్రి పుష్కర ఘాట్‌తో పాటు పంచారామ క్షేత్రాల్లో భక్తులు పెద్దవెత్తున తరలివచ్చారు. విజయవాడలోని కృష్ణా నదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు ఇంద్రకీలాద్రి చుట్టూ గిరిప్రదక్షిణ నిర్వహించారు. దుర్గాఘాట్ వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మిగతాది 2లో...



ఇంటర్ ప్రాక్టికల్స్‌లో జంబ్లింగ్ విధానం రద్దు

(మొదటి పేజీ తరువాయి)

ప్రవేశపెట్టడం లేదని స్పష్టం చేసింది. దీంతో విద్యార్థులు గతంలో మాదిరిగానే తాము చదువుతున్న సొంత జూనియర్ కళాశాలల్లోనే ప్రాక్టికల్ పరీక్షలకు హాజరుకానున్నారు. ఇతర కళాశాలలకు కేంద్రాలను కేటాయించే విధానం ప్రస్తుతానికి ఉండదు.కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలు విద్యార్థుల నుంచి అదనపు రుసుములు వసూలు చేస్తూ, సరైన ల్యాబ్ మూల్యాంకనం చేయకుండానే ప్రాక్టికల్స్‌లో పూర్తి మార్కులు (30కి 30) వేస్తున్నాయనే ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో పరీక్షల్లో పారదర్శకత తీసుకురావడానికి జంబ్లింగ్ విధానాన్ని అమలు చేయాలనే ప్రతిపాదన వచ్చినప్పటికీ, 2027 పరీక్షలకు దీనిని అమలు చేయకూడదని బోర్డు నిర్ణయించింది. అలాగే ఈ విద్యా సంవత్సరం నుంచి మొదటి సంవత్సరం విద్యార్థులకు కూడా ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహిస్తున్నారు.

ప్రాక్టికల్ పరీక్షల షెడ్యూల్ 2027

ప్రాక్టికల్ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు సెషన్లలో జరుగుతాయి.

2027 జనవరి 29: మొదటి సంవత్సరం ఇంగ్లిష్ ప్రాక్టికల్స్

2027 జనవరి 30: రెండో సంవత్సరం ఇంగ్లిష్ ప్రాక్టికల్స్

2027 ఫిబ్రవరి 1 నుంచి ఫిబ్రవరి 10 వరకు: రెండో సంవత్సరం సైన్స్ ప్రాక్టికల్స్

2027 ఫిబ్రవరి 11 నుంచి ఫిబ్రవరి 18 వరకు: మొదటి సంవత్సరం సైన్స్ ప్రాక్టికల్స్

బోర్డు తీసుకున్న ఈ నిర్ణయంతో విద్యార్థులకు దూర ప్రాంతాల్లోని పరీక్ష కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా పోయింది. ఈ పరీక్షలకు సంబంధించిన పూర్తి సమాచారం, మార్గదర్శకాల కోసం విద్యార్థులు బోర్డు అధికారిక వెబ్‌సైట్‌ను పరిశీలించవచ్చు.

అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ బ్రాండ్ ఇమేజ్ పెంచేలా గ్లోబల్ సమ్మిట్

హైదరాబాద్, నవంబర్ 24(ప్రజావినికిడి):

హైదరాబాద్ శివారులోని భారత్ ఫ్యూచర్ సిటీలో త్వరలో జరగనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026' ఏర్పాట్లను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఈరోజు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వేదిక నిర్మాణం, ఎక్స్‌పో జోన్, భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నిర్వహణ, అతిథుల వసతి తదితర అంశాలపై అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. సమ్మిట్ ఏర్పాట్లను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... తెలంగాణ బ్రాండ్ ఇమేజ్ మరింత పెరిగేలా గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ పారిశ్రామిక, ఆర్థిక సామర్థ్యాన్ని చాటిచెప్పేందుకు ఈ వేదిక అత్యంత కీలకమని పేర్కొన్నారు. పనులన్నీ సకాలంలో పూర్తయ్యేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు.భారత్ ఫ్యూచర్ సిటీలోని యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ప్రాంగణంలో డిసెంబర్ 7 నుంచి 9 వరకు ఈ సదస్సు జరగనుంది. ఈ సమ్మిట్‌కు ప్రపంచవ్యాప్తంగా సుమారు 1,500 మందికి పైగా సీఈవోలు, పెట్టుబడిదారులు, దౌత్యవేత్తలు హాజరుకానున్నారు. అలాగే డిఫెన్స్, ఫార్మా, గేమింగ్, ఏఐ వంటి కీలక రంగాల నుంచి 1,000 కంటే ఎక్కువ కంపెనీలు పాల్గొనేలా మల్టీ సెక్టార్ ఎక్స్‌పోను కూడా ఏర్పాటు చేస్తున్నారు. భద్రతా పరంగా ఫేషియల్ రికగ్నిషన్ వంటి అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తూ పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ సదస్సును ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనుంది.

వైభవ్ సూర్యవంశీ విశ్వరూపం

(మొదటి పేజీ తరువాయి)

చాడ్ బోవ్స్ 103 బంతుల్లో నెలకొల్పిన ప్రపంచ రికార్డును సూర్యవంశీ సగానికి సగం బంతుల్లోనే బద్దలు కొట్టడం గమనార్హం. గతంలో ఎన్ జగదీశన్ (114 బంతులు), హ్యారీ బ్రూక్ (114 బంతులు) పేరిట ఉన్న రికార్డులన్నీ ఈ సునామీ ధాటికి కొట్టుకుపోయాయి.

దోహా వేదికగా యూఏఈతో జరిగిన ఏసీసీ మెన్స్ ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ 2026 గ్రూప్-బి పోరులో వైభవ్ బ్యాటింగ్‌కు ప్రత్యర్థి బౌలర్లు బెంబేలెత్తిపోయారు. క్రీజులోకి వచ్చిన క్షణం నుంచే సిక్సర్ల వర్షం కురిపించిన సూర్యవంశీ.. ఒకే ఇన్నింగ్స్‌లో ఏకంగా 28 సిక్సర్లు బాది యావత్ ప్రొఫెషనల్ క్రికెట్ చరిత్రలోనే అత్యధిక సిక్సర్ల ఆల్‌టైమ్ వరల్డ్ రికార్డును లిఖించాడు. 2024 రంజీ ట్రోఫీలో హైదరాబాద్ బ్యాటర్ తన్మయ్ అగర్వాల్ కొట్టిన 26 సిక్సర్ల రికార్డును అతడు అధిగమించాడు. న్యూజిలాండ్ విధ్వంసకర బ్యాటర్ కొలిన్ మన్రో (23 సిక్సర్లు), ఆస్ట్రేలియా ప్లేయర్ డార్సీ షార్ట్ (23 సిక్సర్లు) సాధించిన మైలురాళ్లను కూడా వైభవ్ సునాయాసంగా దాటేశాడు.

వైభవ్ ఆడిన ఈ నమ్మశక్యం కాని ఇన్నింగ్స్‌లో మొదట కేవలం 16 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆ తర్వాత సునామీలా విరుచుకుపడుతూ 28 బంతుల్లో సెంచరీ కొట్టి లిస్ట్-ఏ క్రికెట్లో ఫాస్టెస్ట్ సెంచరీ రికార్డు బద్దలు కొట్టాడు. ఆ తర్వాత 40 బంతుల్లో 150 మార్కును అందుకున్నాడు. ఇది కూడా ఓ రికార్డే. అక్కడితో ఏమాత్రం ఆగకుండా అదే జోరు కొనసాగిస్తూ 52 బంతుల్లోనే 200 పరుగుల మార్కును దాటి రికార్డులను తిరగరాశాడు. లిస్ట్-ఏ చరిత్రలో వేగవంతమైన సెంచరీ, ఫాస్టెస్ట్ 150, అత్యంత వేగవంతమైన డబుల్ సెంచరీ.. ఇలా అన్ని రికార్డులనూ ఒకే మ్యాచ్‌లో కొల్లగొట్టిన ఏకైక బ్యాటర్‌గా నిలిచాడు. వైభవ్ ధాటికి ఇండియా-ఏ కేవలం 5 ఓవర్లలోనే 100 పరుగులు పూర్తి చేసుకుని సరికొత్త జట్టు రికార్డును సైతం నమోదు చేసింది.

తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న యూఏఈ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 249 పరుగులు చేసింది. ఆరంభంలోనే హర్షిత్ రాణా, అర్షద్ ఖాన్ చెలరేగడంతో 20 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడ్డ యూఏఈని మాజీ భారత దేశవాళీ బ్యాటర్ హర్‌ప్రీత్ సింగ్ భాటియా అద్భుత శతకంతో ఆదుకున్నాడు. హర్‌ప్రీత్ 144 బంతుల్లో 12 ఫోర్లు, 4 సిక్సర్లతో 130 పరుగులు సాధించి జట్టుకు భారీ స్కోరు అందించగా.. మహ్మద్ షహదాద్ (28), ఏతాన్ డిసౌజా (25), చివర్లో కెప్టెన్ బాసిల్ హమీద్ (నాటౌట్ 36) అతడికి విలువైన సహకారం అందించారు. భారత బౌలర్లలో అర్షద్ ఖాన్ 10 ఓవర్లలో 43 పరుగులిచ్చి 4 వికెట్లతో సత్తా చాటగా.. హర్షిత్ రాణా, సూర్యాంశ్ షెడ్గే, హర్ష్ దూబే, షాబాజ్ అహ్మద్ తలో వికెట్ పడగొట్టారు.

అనంతరం భారత బ్యాటర్లలో వైభవ్ 53 బంతుల్లో 204 పరుగులు చేసి ఔటయ్యాడు. ఛేదించాల్సిన లక్ష్యాన్ని దాదాపు ఒక్కడే పూర్తి చేశాడు. అభిషేక్ శర్మ (12), ప్రభ్‌సిమ్రన్ సింగ్ (3) తక్కువ పరుగులకే వెనుదిగిరారు. రింకూ సింగ్ 27, కుమార్ కుషాగ్ర 1 నాటౌట్‌గా నిలిచి 14.2 ఓవర్లలోనే మ్యాచ్‌ను ముగించారు.

హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్లకు ఉచిత రిజిస్ట్రేషన్

(మొదటి పేజీ తరువాయి)

పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. సామాన్యుల సొంతింటి కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం చిత్తశుద్ధితో అడుగులు వేస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ క్రమంలో ఇందిరమ్మ టవర్స్‌కు తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (టీజీ రెరా)లో రిజిస్ట్రేషన్ పూర్తి కావడం ఒక కీలక ముందడుగు అని, ప్రభుత్వ గృహ నిర్మాణ ప్రాజెక్టు చరిత్రలోనే తొలిసారిగా రెరాలో నమోదు కావడం ప్రజా ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు నిదర్శనమని 'ఎక్స్' వేదికగా వెల్లడించారు.

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని పేదల కోసం ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) పరిధిలో దాదాపు లక్ష ఫ్లాట్లను నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా తొలి దశలో మలక్‌పేట, కుత్బుల్లాపూర్ వంటి ప్రాంతాల్లో చేపట్టిన ఇందిరమ్మ టవర్లకు రెరా అనుమతులు లభించాయి. ప్రభుత్వం ఉచితంగా స్థలాన్ని అందించడమే కాకుండా, లబ్ధిదారుల పేరిట అవిభక్త భూమి వాటాను (యూడీఎస్) నమోదు చేయనుంది.ఈ ప్రాజెక్టుకు రెరా చట్టబద్ధమైన గుర్తింపు రావడంతో లబ్ధిదారుల హక్కులకు పూర్తి భద్రత లభించనుంది. అంతేకాకుండా, లబ్ధిదారులు తమ వాటా సొమ్ము చెల్లించడానికి బ్యాంకుల నుంచి గృహ రుణాలు పొందడం మరింత సులభతరం అవుతుంది. నిర్మాణాలు వేగంగా పూర్తి చేసి, లబ్ధిదారులకు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసిన సేల్ డీడ్లను అందించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు

మూసీ పనుల్లో వేగం పెంచండి

(మొదటి పేజీ తరువాయి)

మిరాలం చెరువు అభివృద్ధి పనుల పురోగతిపై కూడా సీఎం ఆరా తీశారు. చెరువులో ఎన్నో ఏళ్లుగా పేరుకుపోయిన పూడికను తొలగించాలని ఆదేశించారు. రేడియల్ రోడ్ల నిర్మాణం, భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. 2028 జనవరి నాటికి మూసీ ప్రాజెక్టు పనులు పూర్తి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు అధికారులు తెలిపారు.

గండిపేట వద్ద నిర్మిస్తున్న ఆధునిక గోశాల పనులను కూడా సీఎం సమీక్షించారు. 2027 మార్చి నాటికి వాటిని పూర్తి చేసేలా పనుల్లో వేగం పెంచాలని అధికారులకు స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

తెలుగు రాష్ట్రాల్లో భక్తిపారవశ్యం!





(మొదటి పేజీ తరువాయి)

కోటి దీపోత్సవం, జ్వాలాతోరణం కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.తెలంగాణలో వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయం, యాదాద్రి, కీసరగుట్ట, భద్రాచలం, కాళేశ్వరం, ధర్మపురి, హనుమకొండ వేయిస్తంభాల గుడి వద్ద భక్తుల సందడి నెలకొంది. గోదావరి తీరాల్లో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి దీపాలు వెలిగించారు. హనుమకొండ వేయిస్తంభాల గుడిలో సుమారు 2 వేల మంది భక్తులు సామూహిక రుద్రాభిషేకంలో పాల్గొన్నారు. సాయంత్రం లక్ష దీపోత్సవం నిర్వహించారు.జ్వాలాతోరణం.. దీపారాధన ప్రత్యేక ఆకర్షణకార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయాల్లో రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు, ప్రత్యేక అలంకరణలు నిర్వహించారు. సాయంత్రం వేళ మహిళలు, భక్తులు ఆలయాలు, ఇళ్ల వద్ద దీపాలు వెలిగించి కార్తీక దీపారాధన చేశారు. జ్వాలాతోరణం కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయాల వద్ద ప్రత్యేక క్యూ లైన్లు, తాగునీరు, వైద్య సదుపాయాలు, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.కార్తీక పౌర్ణమి వెలుగులతో తెలుగు రాష్ట్రాల్లోని ప్రముఖ పుణ్యక్షేత్రాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి

పారదర్శకంగా పంచాయతీ ఎన్నికలు

(మొదటి పేజీ తరువాయి)

అనిల్‌చంద్ర పునేఠా (ఎస్ఈసీ) సూచించారు. ఎన్నికల అధికారులతో మంగళవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు గతంకంటే అధికంగా కౌంటింగ్ టేబుళ్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల్లోపు కౌంటింగ్ ప్రక్రియ పూర్తిచేసి, తుది ఫలితాలు ప్రకటించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు.ఎన్నికల ప్రక్రియలో ప్రతి దశలోనూ పారదర్శకత, నిష్పక్షపాత వైఖరి, నిబంధనల అమలుకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. పంచాయతీ ఎన్నికలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు అవసరమైన పోలీసు బలగాలను ముందుగానే సమకూర్చుకోవాలని చెప్పారు. నవంబరు 26న 23 పట్టణ స్థానిక సంస్థలు, 26 జిల్లాల్లో గ్రామ పంచాయతీలకు మొదటి దశ ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందని చెప్పారు. అదేరోజు పంచాయతీ ఎన్నికల ఫలితాలు వెలువడుతాయన్నారు.నవంబరు 30న పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు ప్రకటించనున్నట్లు తెలిపారు. నవంబరు 29న రెండో దశ, డిసెంబరు 2న గ్రామ పంచాయతీల మూడో దశ ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందని, డిసెంబరు 5న 23 పట్టణ స్థానిక సంస్థలకు డిప్యూటీ మేయర్/వైస్ చైర్మన్ ఎన్నికలు నిర్వహించడంతో మొత్తం ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందని వివరించారు. ఎన్నికల నిర్వహణలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను ప్రతి ఒక్క అధికారి తప్పక పాటించాలని చెప్పారు.పోస్టల్ బ్యాలెట్లలో చెల్లని ఓట్ల సంఖ్య అధికంగా నమోదవుతున్న అంశాన్ని ఎస్ఈసీ కార్యదర్శి ఎ.మల్లికార్జున ప్రస్తావిస్తూ దీనికిగల కారణాలను విశ్లేషించాలని సూచించారు. పోలింగ్ సిబ్బందికి సరైన శిక్షణ అందించడంతోపాటు ఓటువేసే విధానంపై ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. రీకౌంటింగ్ అభ్యర్థనలపై గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని నిబంధనల ప్రకారం రిటర్నింగ్ అధికారులు నిర్ణయం తీసుకోవాలన్నారు.ఓట్ల లెక్కింపు పూర్తయి, ఫలితాలు ప్రకటించి రిటర్నింగ్ అధికారి సంతకం చేసిన తర్వాత రీకౌంటింగ్ చేపట్టాల్సిన పరిస్థితి రాకుండా ముందుగానే అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఐజీ బి.రాజకుమారి మాట్లాడుతూ అభ్యర్థులు స్వేచ్ఛగా నామినేషన్లు దాఖలు చేసుకునేలా పూర్తి భద్రత కల్పించాలని, ఎలాంటి బెదిరింపులు, దాడులు, భయభ్రాంతులకు తావులేకుండా పోలీసు అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు.

రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని అడ్డుకున్నది కేసీఆరే

బీఆర్ఎస్ హయాంలో నీళ్ల మళ్లింపు లేదు

ముఖ్యమంత్రిపై బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ధ్వజం

హైదరాబాద్, నవంబర్ 24(ప్రజావినికిడి):

నాగార్జునసాగర్ నుంచి నీటిని మళ్లించే ప్రతిపాదన బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో లేదని, సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చాకే ఇందుకు సంబంధించిన జీవో వచ్చిందని బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సాగర్ కింది నుంచి కాల్వ తవ్వి నీటిని తరలించే ప్రతిపాదనకు సంబంధించిన జీవోను పాత జీవోగా చూపిస్తూ సీఎం ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. రేవంత్ రెడ్డి సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో జీవో నంబర్లను తప్పుగా ప్రస్తావించారని హరీశ్‌రావు విమర్శించారు. 2022లో వచ్చిన జీవో 56లో నాగార్జున సాగర్ నుంచి నీటిని మళ్లించే అంశమే లేదని స్పష్టం చేశారు. ఒంగోలు బ్రాంచ్ కెనాల్ ప్రస్తావనను నాగార్జున సాగర్ కెనాల్‌గా పేర్కొంటూ సీఎం వాస్తవాలను వక్రీకరిస్తున్నారని అన్నారు. రేవంత్ ప్రభుత్వం వచ్చాకే జీవో 453 జారీ అయిందని, పాత, కొత్త జీవోలను ఆయన మీడియాముందు ప్రదర్శించారు.జగన్ ప్రభుత్వం రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని చేపట్టిన సమయంలోనే తాము దాన్ని వ్యతిరేకించామని హరీశ్ తెలిపారు. 2020 జనవరి 1న అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వం కృష్ణా నదీ యాజమాన్య బోర్డుకు లేఖ రాసిందని గుర్తు చేశారు. 2020లో కేంద్ర మంత్రి షెకావత్ సమక్షంలో కేసీఆర్.. జగన్‌ను ఉద్దేశించి రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని ఆపకపోతే అలంపూర్ వద్ద బ్యారేజీ నిర్మించి నీటిని అడ్డుకుంటామని హెచ్చరించినట్లు పేర్కొన్నారు. కేసీఆర్ ఆ ప్రాజెక్టుకు మద్దతిచ్చారంటూ రేవంత్ చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. 2024 డిసెంబరు 3న ఏపీ ప్రభుత్వం జారీ చేసిన జీవోలు 403, 405 ద్వారా కృష్ణా జలాలను 700 కి.మీ దూరంలో ఉన్న కుప్పం వరకు తరలిస్తున్నారన్నారు. తెలంగాణ నీటి హక్కుల గురించి ప్రశ్నిస్తే సమాధానం చెప్పాల్సిన సీఎం.. తమపై ఎదురుదాడికి దిగుతున్నారని మండిపడ్డారు.పాలమూరు జిల్లాలో కాంగ్రెస్, టీడీపీ పాలనలో 30వేల ఎకరాలకే సాగునీరు అందించారని, బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో 10 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చామని హరీశ్ పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక తన సొంత జిల్లాలో అదనంగా ఎన్ని ఎకరాలకు సాగునీరు అందించారో చెప్పాలని డిమాండ్ చేశారు. 20 లక్షల ఎకరాలకు నీరిస్తామని అసెంబ్లీలో బడ్జెట్ కేటాయింపులు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం.. అందులో కనీసం 5 శాతమైనా అమలు చేసిందా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాకే పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి, సాగునీటి రంగానికి ప్రాధాన్యమిచ్చిందన్నారు. రేవంత్ ప్రభుత్వం కొత్త ఆయకట్టును సృష్టించలేదని, కొత్త ప్రాజెక్టులనూ చేపట్టలేదని విమర్శించారు. సాగునీటి ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితి, లిఫ్టుల నిర్వహణ, కొత్తగా సాగునీరు అందించిన వివరాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, 299:512 టీఎంసీల నీటి పంపిణీ, రాయలసీమ ఎత్తిపోతల పథకం, పోతిరెడ్డిపాడు, నాగార్జునసాగర్ నుంచి నీటి మళ్లింపు తదితర అంశాలపై సీఎం చేసిన వ్యాఖ్యలకు పత్రాలతో సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నానని హరీశ్ ప్రకటించారు. అసెంబ్లీలో మైకులు కట్ చేయకుండా అవకాశం ఇస్తే వారం, పది రోజుల పాటు అయినా ఈ అంశాలపై చర్చిస్తానన్నారు. రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని తానే అడ్డుకున్నానన్న రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను ఏపీ సీఎం చంద్రబాబు ఖండించారని హరీశ్ పేర్కొన్నారు. ఎన్జీటీలో కేసులు వేసి తెలంగాణ ప్రభుత్వం పనులు నిలిపివేయించిందని, రేవంత్‌రెడ్డి వాటిని అడ్డుకోలేదని చంద్రబాబు చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు.

ఐదుగురు దుర్మరణం

భోగాపురం/విజయనగరంనవంబర్ 24(ప్రజావినికిడి):

: కార్తీక పౌర్ణమి వేళ శ్రీముఖ లింగేశ్వరుడిని దర్శించుకుని ఆనందంగా ఇంటికి తిరుగు పయనమైన స్నేహితులను రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు వెంటాడింది. విజయనగరం జిల్లా భోగాపురం మండలం కొత్త పెట్రోల్ బంక్ సమీపంలో ఆగి ఉన్న లారీని వారు ప్రయాణిస్తున్న థార్ జీపు ఢీకొనడంతో మంటలు చెలరేగాయి. వాహనంలోని నలుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, తీవ్రంగా గాయపడిన మరో వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు.

మంగళవారం ఉదయం 7.30 గంటల సమయంలో శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వైపు వెళ్లే జాతీయ రహదారిపై ఈ ప్రమాదం జరిగింది. విశాఖ జిల్లా మధురవాడకు చెందిన కొండపు సూరిబాబు, తగరపువలసకు చెందిన భార్యాభర్తలు బొర్రా శ్రుతి (31), బొర్రా సతీశ్(40); పోతలమల్లయ్యపాలెంకు చెందిన దంపతులు వాకలపూడి శ్రీను(42), కుసుమ రజని (39) కుటుంబాల మధ్య మంచి స్నేహ సంబంధాలు ఉన్నాయి. శ్రీను విశాఖ ద్వారకానగర్ రిలయన్స్ డిజిటల్‌లో స్టోర్ మేనేజర్. బొర్రా సతీశ్ సీఎంఆర్ సెంట్రల్ డిపార్ట్‌మెంటల్ స్టోర్ మేనేజర్. కొండపు సూరిబాబు విజయనగరంలోని రిలయన్స్ డిజిటల్‌లో డిపార్ట్‌మెంటల్ మేనేజర్. కార్తీక పౌర్ణమి సందర్భంగా శ్రీకాకుళం జిల్లా శ్రీముఖలింగం దర్శనానికి వీరంతా వెళ్లారు. దర్శనం అనంతరం మహీంద్రా థార్ జీపులో తిరుగు పయనమయ్యారు. భోగాపురం మండలం పరిధిలో కొత్తగా నిర్మిస్తున్న పెట్రోల్ బంక్ సమీపంలో ఒడిశా రాష్ట్రం ముండలీ ప్రాంతవాసి ప్రదీపీపకుమార్ తన ట్యాంకర్ లారీని రహదారి పక్కన నిలిపి కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లాడు. అదే సమయంలో వేగంగా వచ్చిన థార్ ఆగి ఉన్న లారీని వెనుకనుంచి బలంగా ఢీకొట్టింది.

దీంతో జీపు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయి మంటలు చెలరేగాయి. డ్రైవింగ్ సీటులో ఉన్న కొండపు సూరిబాబు, పక్కన కూర్చున్న వాకలపూడి శ్రీను, వెనుక సీటులో ఉన్న కుసుమరజని వాహనంలోనే చిక్కుకుని మృతిచెందారు. శ్రుతి రోడ్డుపై పడిపోగా, అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. తీవ్రంగా గాయపడిన సతీశ్‌ను 108 వాహనంలో తగరపువలసలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన కూడా మృతిచెందారు. ప్రమాద తీవ్రతకు జీపు ధ్వంసం కావడంతోపాటు మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న ఎస్పీ దామోదర్ పోలీసులను అప్రమత్తం చేశారు. జీపు ముందు భాగం లారీ కిందకు చొచ్చుకుపోవడంతో భారీ క్రేన్‌ను రప్పించి బయటకు తీయించారు. మృతదేహాలను విజయనగరం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.

పెళ్లిరోజే పెనువిషాదం

మంగళవారం బొర్రా సతీశ్, శ్రుతి దంపతుల పెళ్లిరోజు. జీవితాంతం కలిసుంటామని ప్రమాణం చేసిన రోజునే మృత్యువు వారిని బలితీసుకుంది. సంతోషంగా శివదర్శనానికి వెళ్లిన ఆ దంపతులు.. మరికొద్ది గంటల్లో పిల్లల వద్దకు చేరుకుంటారనగా మృత్యువాత పడ్డారు.

వాకలపూడి శ్రీను దంపతులకు పదేళ్ల జీయస్స్ బాబు, ఆరేళ్ల గ్రీష్మ ఉన్నారు. బొర్రా సతీశ్ దంపతులకు ఆరేళ్ల శరణ్యశ్రీ, తొమ్మిదేళ్ల వేంకట ధన్యశ్రీ ఉన్నారు. కొండపు సూరిబాబుకు భార్య గౌరి, 12 ఏళ్ల కుమార్తె భవ్యశ్రీ, పదేళ్ల కుమారుడు రేవంత్‌రెడ్డి ఉన్నారు. తండ్రి మృతదేహాన్ని చూసిన కుమార్తె భవ్యశ్రీ తట్టుకోలేక కుప్పకూలిపోయింది. భోగాపురం దుర్ఘటనపై మంత్రులు వంగలపూడి అనిత, బీసీ జనార్దన్‌రెడ్డి, కొండపల్లి శ్రీనివాస్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. విశాఖ జిల్లా వాసులు మృతిచెందిన విషయం తెలుసుకున్న మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు విజయనగరం జిల్లా కేంద్రాస్పత్రికి చేరుకుని బాధిత కుటుంబాలను పరామర్శించారు. వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

పంజాబ్‌లో ఒక్కటైన పాత మిత్రులు

హోంమంత్రి అమిత్ షా, బీజేపీ అధ్యక్షుడు నితీన్ నబీన్, అకాలీదళ్ అధ్యక్షుడు సుఖ్‌బీర్ సింగ్ బాదల్ ఈ వివరాలు వెల్లడించారు. అకాలీదళ్ తిరిగి ఎన్డీయేలోకి చేరడాన్ని అమిత్ షా స్వాగతించారు. పంజాబ్ కూటమిలో అకాలీదళ్ పెద్దన్న (బడే భాయ్) పాత్ర పోషిస్తుందని, సీఎం పదవి సైతం ఆ పార్టీకే ఉంటుందని చెప్పారు. ఈ పొత్తు కేవలం రాజకీయ అవసరాల కోసం కాకుండా.. పంజాబ్‌లో హిందూ, సిక్కు సోదర భావానికి, ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. తమ బంధం రాజకీయమైనదే కాదని, ఇది పంజాబ్ ప్రయోజనాలకు కీలకమని సుఖ్‌బీర్‌సింగ్ బాదల్ పేర్కొన్నారు. పంజాబ్‌లో డ్రగ్స్ సమస్యను 2029 డిసెంబరు 31 నాటికి పూర్తిగా నిర్మూలించడమే తమ మొదటి లక్ష్యమని ఇరు పార్టీల నేతలు ప్రకటించారు. పంజాబ్‌లోని మొత్తం 117 అసెంబ్లీ సీట్లలో బీజేపీ 40 సీట్లలో పోటీచేసే అవకాశముందని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. పంజాబ్ రాజకీయాల్లో బీజేపీ, అకాలీదళ్ సుదీర్ఘకాలం మిత్రపక్షాలుగా కొనసాగాయి. ఆరేళ్ల క్రితం కేంద్ర వ్యవసాయ చట్టాలపై తలెత్తిన విభేదాల నేపథ్యంలో ఎన్డీయే నుంచి అకాలీదళ్ బయటికి వచ్చింది. తర్వాత జరిగిన పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలు, లోక్‌సభ ఎన్నికల్లో అకాలీదళ్, బీజేపీ ప

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

బుధవారం 25 నవంబర్ 2026

లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ దక్కన్ నూతన సభ్యుల ఇండక్షన్, కార్యాచరణ సమావేశం





హైదరాబాద్,(ప్రజావినికిడి):
లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ దక్కన్ ఆధ్వర్యంలో నూతన సభ్యుల ఇండక్షన్ అదేవిదంగా భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక సమావేశం చంపాపేట్‌లోని ఎన్ విలేజ్ హోటల్‌లో ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్లు లయన్ డాక్టర్ రాజగోపాల్ రెడ్డి, లయన్ బండారు ప్రభాకర్,మాజీ ప్రెసిడెంట్ లయన్ సుధాకర్ రెడ్డి హాజరై సేవా కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ హన్మంత్ రెడ్డి, డెర్మటాలజిస్ట్ డాక్టర్ మేధిని రెడ్డి,దంత వైద్య నిపుణులు డాక్టర్ మధుసూదన్ రెడ్డి, హైదరాబాద్ హోమియో క్లినిక్ వైద్యులు డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, వ్యాపారవేత్త లింగేష్ గుప్తా క్లబ్‌లో నూతన సభ్యులుగా చేరారు. భవిష్యత్తులో పేదలకు ఉచిత మెడికల్ క్యాంపుల నిర్వహణ, కామధేను అన్నదాన కార్యక్రమ విస్తరణ,ప్రతి అమావాస్యకు వెయ్యి మందికి అన్నదానం చేసేలా సభ్యులు తీర్మానించారు. అనంతరం లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ దక్కన్ ప్రెసిడెంట్ లయన్ వెంకటేశ్వర్ రెడ్డి (ఎస్ఎన్ కార్ డెక్కర్స్ యాజమాని చంపాపేట్) మాట్లాడుతూ, మన దక్కన్ క్లబ్‌లో ఉన్నత విద్యావంతులైన వైద్య నిపుణులు, ప్రముఖ వ్యాపారవేత్తలు అలాగే సమాజ సేవ పట్ల ఆసక్తి కలిగిన వ్యక్తులు సభ్యులుగా ఉండటం ఎంతో సంతోషకరమైన విషయమని తెలిపారు. సమాజానికి సేవ చేయాలనే గొప్ప సంకల్పంతో ప్రతి ఒక్కరూ ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. సభ్యులందరి సమిష్టి సహకారం, ప్రోత్సాహం మరియు అంకితభావంతో భవిష్యత్తులో మరెన్నో అర్థవంతమైన సేవా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ మనీషా సింగ్, తదితర సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక పౌర్ణమి వనబోజనాలు





వాజేడు,నవంబర్ 25,(ప్రజావినికిడి):
వాజేడు మండలం పెద్దగొల్లగూడెం శ్రీ రామాలయంలో కార్తీక దీపారాధన జరిగింది పెద్దగొల్లగూడెంలో పూర్వకాలం నుండి కార్తీక పౌర్ణమి రోజున వనబోజనాలకు అడవికి వెళ్తారు కార్తీక మాసంలో వచ్చే పౌర్ణమి రోజున గ్రామస్తులు ఉదయం 4,గంటలకు గోదావరి స్నానానికి వెళ్లి వచ్చి అడవిలోకి వనబోజనాలకు వెళ్లి అక్కడ ఇంట్లో కాసే కూరగాయలతో కొత్త బియ్యంతో బోజనాలు వండి ఉసిరిక చెట్టు క్రింద పందిరి వేసి పంచ పాడవులకు పూజలు చేస్తారు. వేప చెట్టు క్రింద శివునికి పూజలు చేసి వండిన వంటలు సమర్పించిన తర్వాత అందరు వనబోజనాలు చేస్తారు సాయంత్రం గ్రామంలో ఉన్న రామాలయానికి వెళ్లి దీపారాధన చేస్తారు.ఈ కార్యక్రమంలో మహిళలు, పెద్దలు,పిల్లలు పాల్గొన్నారు

కిషన్ నగర్ వేద పాఠశాలలో వైభవంగా లక్ష దీపోత్సవం..
పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్





షాద్‌నగర్,(ప్రజావినికిడి):పట్టణంలోని కిషన్ నగర్ రోడ్డులో గల కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన లక్ష దీపోత్సవ కార్యక్రమంలో షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తులు భక్తిశ్రద్ధలతో దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.వేలాది దీపాల వెలుగులతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.భక్తుల హరిహర నామస్మరణలు, వేద మంత్రోచ్చారణల మధ్య కార్యక్రమం భక్తిమయ వాతావరణంలో కొనసాగింది.ఈ సందర్భంగా చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.కార్తీక మాసంలో దీపారాధన చేయడం వల్ల ఆధ్యాత్మిక ప్రశాంతత,భక్తిభావం పెంపొందుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వేద పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు సజ్జల కాశీనాథ్,ఆలయ అర్చకులు సంగయ్య స్వామి,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సమ్మక్క బ్యారేజీని బద్దలు కొడతాం
చలో హైదరాబాద్.. డిసెంబర్ 9 భారీ బహిరంగ సభలో భాగంగా బైకు ర్యాలీ





వాజేడు,నవంబర్ 25,(ప్రజావినికిడి):
తుపాకులగూడెం ప్రాజెక్టులో వీటిని నిలువ చేసి దిగువ బాగాన ఉన్న ఆదివాసి రైతులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని , వెంటనే ఆ నీటిని ఆదివాసి రైతుల వ్యవసాయానికి అందించాలని, లేకపోతే ప్రాజెక్టుని గడ్డపారలతో త్రవ్వుతామని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మైపతి అరుణ్ కుమార్ అన్నారు. మంగళవారం తుడుందెబ్బ మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన బైకు ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ చతిస్గడ్ రాష్ట్రాల సరిహద్దులలో గల భీరమయ్యను దర్శించుకున్న తుడుందెబ్బ బృందం వాజేడు మండలం మీదుగా వెంకటాపురం మండలం ఎదిర గుట్టల వరకు బైకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తుపాకులగూడెం ప్రాజెక్టు దిగువన ఉన్న ఆదివాసి రైతులు ప్రాజెక్టు అధికారుల పనితీరు కారణంగా వేల ఎకరాల్లో వ్యవసాయం ఎండిపోయే పరిస్థితి ఉందని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా అరుణ్ కుమార్ మాట్లాడుతూ,ఏజెన్సీ ప్రాంతంలోని నీళ్లు,నిధులు, నియామకాలు మైదాన ప్రాంతంలోని వారు దోచుకుంటున్నారని మండిపడ్డారు. గోదావరిపై ఎక్కడికక్కడ ప్రాజెక్టులను నిర్మించి మైదాన ప్రాంతంలోని 82 లక్షల ఎకరాల్లో మూడు పంటలకు నీటిని ప్రాజెక్టుల ద్వారా తరలించుకు పోతున్నారని వాస్తవాలను వివరించారు. పట్టణ ప్రాంతాల నుండి వచ్చిన వారు భూములను ఆక్రమించి స్వాధీనం చేసుకుంటూ,ఆ భూములలోనే ఆదివాసులను కూలీలుగా మారుస్తున్నారని పేర్కొన్నారు. అడవి ఫల సాయంతో బ్రతికే ఆదివాసీలను అటవీశాఖ అధికారులు అడవుల్లోకి వెళ్లకుండా అడ్డుకుంటున్నారని గుర్తు చేశారు. ఐటీడీఏ సింగిల్ లైన్ అడ్మినిస్ట్రేషన్ ద్వారా జరగవలసిన ఉద్యోగ నియామకాలు కూడా హైదరాబాద్ లో ఉండే టీజీపీఎస్ నిర్వహించడంతో గిరిజనులను తీవ్ర అన్యాయం పేర్కొన్నారు.ఈ విధంగా ఏజెన్సీ ప్రాంతంలోని విద్యుత్ , సిమెంటు,పేపర్ బోర్డు,సింగరేణి కంపెనీలలో ఆదివాసుల వాటాను ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తుపాకులగూడెం ప్రాజెక్టులో జరుగుతున్న నీటి దోపిడీ కూడా అందులో భాగమేనని వివరించారు. రెండు రోజులలో ఆదివాసి రైతులకు గేట్లను ఎత్తి పారుదల నీటి ద్వారా వ్యవసాయం చేసుకునే రైతులకు వీటిని అందించకపోతే గడ్డపారాలతో ప్రాజెక్టుని బద్దలు కొడతామని ప్రభుత్వాన్ని, అధికారులను హెచ్చరించారు. తెలంగాణ వచ్చిన తర్వాత ఆదివాసులను ప్రభుత్వాలు చేస్తున్న దోపిడిని అరికట్టేందుకు తుడుందెబ్బ ఆధ్వర్యంలో హైదరాబాదులో డిసెంబర్ 9న నిర్వహిస్తున్న లక్ష విల్లంబుల వారి బహిరంగ సభను ఆదివాసి ప్రజలు లక్షల్లో హాజరై ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ జాతీయ ఉపాధ్యాక్షుడు పోడెం బాబు, ఆదివాసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొప్పుల రవి, ఆదివాసి మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు వట్టం సుభద్ర, రాష్ట్ర ఉపాధ్యక్షులు పులుషే బాలకృష్ణ,రాష్ట్ర ప్రచార కార్యదర్శి రేగ గణేష్, కార్యవర్గ సభ్యులు చింత మోహన్,జిల్లా అధ్యక్షుడు నల్లబోయిన లక్ష్మణ్,వర్కింగ్ ప్రెసిడెంట్ పూనెం చంటి,జిల్లా ఉపాధ్యక్షులు పద్దం సుధాకర్, జిల్లా సోషల్ మీడియా ఇంచార్జి తుర్స చంటి,వాజేడు మండల గౌరవ అధ్యక్షుడు అట్టం.శ్రీనివాస్, నాయకులు మొడెం సందీప్, మల్లిఖార్జున్, వెంకటాపురం మండల నాయకులు పూనెం శ్రీకాంత్, అనిల్ వందల సంఖ్యలో ఆదివాసీ యువకులు, వివిధ గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి చొరవతో కేశంపేటలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందచేసిన ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు



షాద్ నగర్,(ప్రజావినికిడి): నియోజకవర్గంలోని కేశంపేట మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వారికి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి సిఫారసు మేరకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం మండల ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్ నాయకులు అందజేశారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఆలూరు సరళమ్మ (అల్వాల్),టి.చెన్న కేశవులు (దత్తాయిపల్లి),సరిత (ఇప్పలపల్లి), కుమ్మరి ఆంజనేయులు (భైర్ఖాన్‌పల్లి), గంజి లక్ష్మయ్య (తొమ్మిదిరేకుల), జర్పుల రవి (తొమ్మిదిరేకుల), దిద్దెల అంజమ్మ (లేమామిడి),అలాగే నిర్ధవెల్లి పరుశురాములు (కొత్తపేట)లకు మంజూరైన 2,20,000 విలువలగల చెక్కులను పంపిణీ చేశారు.అనారోగ్య సమస్యలతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న తమకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందించి ఆదుకున్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డికి లబ్ధిదారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కేశంపేట సర్పంచ్ బొజ్జం సంతోష శ్రీశైలం యాదవ్,పోమాలపల్లి సర్పంచ్ బుర్రి స్వప్న భూపాల్ రెడ్డి,భైరఖాన్ పల్లి సర్పంచ్ తనయుడు శివ యాదవ్,మాజీ సర్పంచ్లు శేఖర్ పంతులు,శ్రీశైలం గౌడ్,తాండ్ర విష్ణు వర్ధన్ రెడ్డి,ఆంజనేయులు యాదవ్,బాలరాజ్ గౌడ్,కృష్ణయ్య,కంటెస్టేడ్ సర్పంచ్ లు బోదునాం పల్లి శేఖర్,తొమ్మిది రేకుల రాంరెడ్డి,డిప్యూటీ సర్పంచ్ యారం రాంరెడ్డి,మాజీ ఎంపీటీసి యాదయ్య,జగన్ రెడ్డి,లక్ష్మయ్య జగత్ రెడ్డి,నాగరాజు,మురళి, చింటూ,శశి,కిషోర్,చౌలపల్లి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట భవాని మాత ఆలయంలో కార్తీక పౌర్ణమి వేడుకలు







కొత్తపేట.(ప్రజావినికిడి):
కొత్తపేట భవాని మాత మందిరంలో ఋషి(భావన ఋషి) ఆధ్వర్యంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారి ప్రాంగణంలో కార్తీక పౌర్ణమి దీపారాధన మహోత్సవం అత్యంత భక్తి శ్రద్ధలతో మహిళలు దీపాలు వెలిగించారు.దీపాల కాంతుల వెలుగులో శివయ్య దర్శనం ఇస్తున్నట్టు కనిపించగా మహిళలు భక్తులు ఓం నమశివాయ అంటూ భక్తి పరవశంతో మునిగిపోయారు అదేవిధంగా భవాని అమ్మవారిని ఊరేగింపుతో జ్వాలతోరణం అంటించి అమ్మవారిని సాదరంగా ఆహ్వానించారు. తదనంతరం ఆకాశదీపం ఏర్పాటు చేశారు ఆకాశ దీపాన్ని భక్తులు వీక్షించి ఓం నమశ్శివాయ అనే నామ స్మరణలతో గుడి ప్రాంగణం అంతా భక్తులతో సందడిగా మారిపోయింది. తర్వాత భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు తీసుకుని కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.

సర్కారు భూమికి కన్నం..
దొంగ పత్రాలతో ఆక్రమణ..

వెలుగులోకి తెచ్చిన భారీ భూ కుంభకోణం..

కథనంపై స్పందించిన మేడ్చల్ జిల్లా యంత్రాంగం..

సీసీఎల్ఏకు సమగ్ర నివేదిక పంపిన కలెక్టర్

బాధ్యులపై చర్యలు తీసుకోవాలని టీఎస్ఎల్ఎస్ఏ ఆదేశాలు..





ఎం.వి రెడ్డి



వి. లచ్చిరెడ్డి

హైదరాబాద్,(ప్రజావినికిడి):
గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఎకర భూమి కోట్లలో ఉంది.ఇదే అదనుగా కొందరు అక్రమార్కులు నకిలీ పత్రాలు సృష్టించి కోట్ల విలువచేసే భూములను అధికారులతో కలిసి స్వాహా చేస్తున్నారు. అధికారులు కూడా అధికారాన్ని అడ్డుపెట్టుకొని భూ కబ్జాలకు పూర్తిగా తమ సహాయ సహకారాలు అందిస్తూ కోట్లు గడిస్తున్నారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఉప్పల్ మండలం బండ్లగూడ గ్రామంలోని సర్వే నంబర్ 36/5 లోని దాదాపు 10 ఎకరాల విలువైన ప్రభుత్వ భూమిని కొందరు అక్రమార్కులు నకిలీ పత్రాలు సృష్టించి స్వాహా చేసిన వైనం అందరికీ తెలిసిందే.దీనిని సామజిక కార్యకర్త పట్నం బాబా గౌడ్ ఇచ్చిన ఆధారాలతో పలు పత్రికలు వెలుగులోకి తీసుకురావడంతో,ప్రభుత్వానికి వందల కోట్ల నష్టం కలగకుండా అడ్డుకుంది. అసలు రాచకొండ కనకయ్య అనే వ్యక్తి స్వాతంత్ర్య సమరయోధుడు (ఫ్రీడమ్ ఫైటర్) కాకపోయినప్పటికీ,ఆయన పేరుతో తప్పుడు పత్రాలు సృష్టించి ప్రభుత్వ భూమిని ఆక్రమించారన్న భారీ కుంభకోణంపై 'ప్రజాప్రశ్న' పూర్తి ఆధారాలతో కథనాన్ని వెలుగులోకి తెచ్చింది.ఈ అక్రమాలపై వచ్చిన ఫిర్యాదు మేరకు రెవెన్యూ యంత్రాంగం, ఉన్నతాధికారులు స్పందించారు.

అక్రమ నిర్మాణాలు అమ్మకాలు

రాచకొండ కనకయ్య పేరుతో ఉన్న ప్రభుత్వ 10 ఎకరాల భూమిలో ఎలాంటి అబ్జర్వేషన్ ఫైళ్లు, రికార్డులు తహసీల్దార్ కార్యాలయంలో లేకపోయినా, దీనిని అడ్డుపెట్టుకుని సాధారణ పవర్ ఆఫ్ అటార్నీ (జీపీఏ)లు, రిజిస్టర్డ్ సేల్ డీడ్‌లు చేసుకుంటూ పోయారు, అప్పటి మాజీ కలెక్టర్ ఎం.వి రెడ్డి,ఆర్డీవో లచ్చిరెడ్డి పూర్తిగా సహకరించారన్న ఆరోపణలు ఉన్నాయి.భూ కబ్జాపై పూర్తిస్థాయిలో విచారణ చేసి వాస్తవాలను దాచి పెట్టారా.? ఈ క్రమంలో శ్రీ చక్ర డెవలపర్స్, కీర్తి కన్స్ట్రక్షన్స్ అండ్ డెవలపర్స్ చేతులు మారుతూ చివరికి 'పల్లవి డీబీఆర్' (పల్లవి డెవలపర్స్) పేరుతో భారీ అక్రమ నిర్మాణాలు చేపట్టారు. ప్రభుత్వ భూమిని అమాయక ప్రజలకు ప్లాట్లుగా, భవనాలుగా విక్రయించి కోట్లు దండుకున్నారు. ప్రస్తుతం ఆ భూమిలో బహుళ అంతస్తుల భవనాలు, అపార్ట్‌మెంట్లు, స్వతంత్ర గృహాలు (ఇండిపెండెంట్ ఇళ్లు) వెలసినట్లు అధికారులు గుర్తించారు.

సీసీఎల్ఏకు కలెక్టర్ సమగ్ర నివేదిక

ఈ భారీ భూ కుంభకోణంపై పూర్తి స్థాయిలో స్పందించిన మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్,సమగ్ర నివేదికను భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ)కి పంపడం జరిగింది. అసలు రికార్డులలో ఎలాంటి అసైన్‌మెంట్ ఫైళ్లు,ఫైసల్ పట్టీలు లభించలేదని, కేవలం 1987-88 పహణీ నుంచి మాత్రమే అక్రమంగా రాచకొండ కనకయ్య పేరు వచ్చి చేరిందని నివేదికలో స్పష్టం చేశారు.హోమ్ శాఖ,విజిలెన్స్ విభాగాన్ని సంప్రదించగా రాచకొండ కనకయ్య స్వాతంత్ర్య సమరయోధుడు అనడానికి ఎలాంటి ఆధారాలు, రికార్డులు లభించలేదని స్పష్టమైంది.

తెలంగాణ రాష్ట్ర చట్టపరమైన సేవల అధికార సంస్థ (టీఎస్ఎల్ఎస్ఏ) సీరియస్

దొంగ స్వాతంత్ర్య సమరయోధుడు ధ్రువీకరణ పత్రాలు,నకిలీ పత్రాల ద్వారా 10 ఎకరాల సర్కారీ భూమి ఆక్రమణకు గురైన వైనంపై మరింత స్పష్టతనిస్తూ అధికారిక పత్రాలు వెలుగుచూశాయి.08-07-2026 నాడు గౌరవనీయ తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి సమర్పించిన ఫిర్యాదుపై 'ఆఫీస్ ఆఫ్ ది తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ' (టీఎస్ఎల్ఎస్ఏ) తీవ్రంగా స్పందించింది.

ఈ మేరకు టీఎస్ఎల్ఎస్ఏ పరిపాలనాధికారి (సీనియర్ సివిల్ జడ్జి హోదాలో) ప్రొసీడింగ్స్ నంబర్ రాక్.నెం.3620/టీఎస్-ఎల్ఎస్ఏ/2026,తేదీ: 30.07.2026 ద్వారా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌కు అధికారికంగా లేఖ రాశారు. పిటిషనర్ ఫిర్యాదుపై ఇప్పటివరకు తీసుకున్న చర్యల నివేదికను వెంటనే సమర్పించాలని ఆ లేఖలో స్పష్టంగా ఆదేశించారు. ఇదే అంశానికి సంబంధించి గౌరవ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి కార్యాలయానికి కూడా ఓసీజే ఆర్సీ.నెం. 1504/2026, తేదీ: 09.07.2026 ద్వారా సమాచారం అందించినట్లు ఆ పత్రంలో పేర్కొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడాల్సిన కొన్ని వ్యవస్థల అపవిత్ర ప్రమేయంతోనే ఇక్కడ నిరభ్యంతర పత్రాలు



(ఎన్ఓసీలు) జారీ కావడం, జీహెచ్ఎంసీ అనుమతులు పొందడం జరిగిందని తీవ్రమైన విమర్శలు వస్తున్నాయి.ఈ నేపథ్యంలో భూ పరిపాలనా ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) చట్టపరమైన సేవల అధికార సంస్థ (టీఎస్-ఎల్ఎస్ఏ) మరింత గట్టిగా దృష్టి పెట్టడంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.ప్రభుత్వ భూమిని కాపాడి, బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

వైద్యం.. భరోసా.. బాధ్యత

వనస్థలిపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

వార్డుల్లో వైద్యుల పర్యవేక్షణ,మందులు,పనిచేసే ఫౌలర్ బెడ్లు, మరుగుదొడ్లలో నీటి వసతులు కల్పించాలని విజ్ఞప్తి

వనస్థలిపురం,(ప్రజావినికిడి): నవంబర్ 24:
ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే సామాన్య ప్రజలకు నాణ్యమైన వైద్యంతోపాటు మానసిక ధైర్యాన్ని అందించడం వైద్య సిబ్బంది బాధ్యత. రోగులను కుటుంబ సభ్యులుగా భావించి, వారి ఆరోగ్య పరిస్థితిని అర్థం చేసుకుంటూ సేవలందించాలి. అయితే వనస్థలిపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో కొన్ని వార్డుల్లో కనీస సౌకర్యాల కొరతపై రోగులు, వారి సహాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఆసుపత్రిలోని సమస్యలను సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్లిన వెంటనే సంబంధిత వార్డు డ్యూటీ మెడికల్ ఆఫీసర్ డీఎంఓ, నర్సింగ్ సూపరింటెండెంట్, రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ ఆర్ఎంఓ లకు రోగుల ఆరోగ్య పరిస్థితిపై ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించడం ఆయన ప్రత్యేకతగా పేర్కొంటున్నారు. ఆసుపత్రి అభివృద్ధి, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో సూపరింటెండెంట్ ప్రయత్నిస్తున్నప్పటికీ,రాష్ట్ర ప్రభుత్వం నుంచి అవసరమైన సౌకర్యాలు,వనరులు అందుబాటులో లేకపోతే ఎంత సమర్థవంతమైన అధికారి అయినా పరిమితుల మధ్యే పనిచేయాల్సి వస్తుందని అభిప్రాయపడుతున్నారు.

వార్డుల్లో వైద్యుల పర్యవేక్షణ తప్పనిసరి:
ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగుల ఆరోగ్య పరిస్థితిని డ్యూటీ వైద్యులు నిరంతరం పర్యవేక్షించాలని రోగుల సహాయకులు కోరుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లోనూ వైద్యులు, నర్సింగ్ సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రతి వార్డులో విధులకు అనుగుణంగా వార్డు బాయ్ లేదా వార్డు ఉమెన్ తప్పనిసరిగా ఉండేలా చూడాలని కోరుతున్నారు. రోగులకు అత్యవసర సమయంలో సహాయం అందించడంతోపాటు



వార్డుల నిర్వహణ, పరిశుభ్రతపై సిబ్బంది దృష్టి సారించాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు.రోగుల భద్రత, వైద్య సేవల నిర్వహణ దృష్ట్యా వార్డు గదులను అవసరమైన విధంగా మూసి ఉంచి,అనధికార వ్యక్తుల రాకపోకలను నియంత్రించాలని కోరుతున్నారు.అయితే రోగులు,వారి సహాయకులకు అవసరమైన సమయంలో సిబ్బంది సహాయం అందుబాటులో ఉండాలని స్పష్టం చేస్తున్నారు.

పనిచేయని ఫౌలర్ బెడ్లు..మందుల కొరత:
ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు అవసరమైన ఫౌలర్ బెడ్లు సరిగా పనిచేయడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనారోగ్యంతో బాధపడుతున్న రోగులకు బెడ్లను సర్దుబాటు చేసుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారి సహాయకులు చెబుతున్నారు.

రోగులకు అవసరమైన మందులు అందుబాటులో లేకపోవడం వల్ల బయట కొనుగోలు చేయాల్సి వస్తోందని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేద, మధ్యతరగతి ప్రజలకు అవసరమైన మందులు ఉచితంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బాత్రూంలలో నీటి కొరత..వేడినీటి వసతి ఏదీ?:
ఆసుపత్రి వార్డుల్లోని బాత్రూంలు, మరుగుదొడ్లలో నీటి సరఫరా సరిగా ఉండటం లేదని రోగులు, వారి సహాయకులు ఆరోపిస్తున్నారు. అనేక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న రోగులకు కనీసం బాత్రూంలో వేడినీటి సౌకర్యం కూడా అందుబాటులో లేకపోవడం ఇబ్బందికరంగా మారిందని వాపోతున్నారు.

మరుగుదొడ్లు,స్నానపు గదుల్లో నిరంతర నీటి సరఫరా ఉండేలా చూడటంతోపాటు,రోగుల ఆరోగ్య పరిస్థితికి అనుగుణంగా వేడినీటి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు. ఆసుపత్రిలో పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరిచి, రోగులకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు.

రోగులతో మానవీయంగా వ్యవహరించాలి
ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు ఇప్పటికే అనారోగ్యంతో మానసికంగా ఆందోళనలో ఉంటారు. అలాంటి సమయంలో వారితో కోపంగా మాట్లాడకుండా వారి పరిస్థితిని అర్థం చేసుకుని ఆప్యాయంగా వ్యవహరించాలని రోగుల సహాయకులు కోరుతున్నారు.

వైద్యులు,నర్సింగ్ సిబ్బంది రోగులకు కుటుంబ సభ్యుల్లా అండగా నిలిచి,వైద్యంతోపాటు మానసిక ధైర్యాన్ని అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.రోగుల సహాయకులకు అవసరమైన సమాచారాన్ని స్పష్టంగా తెలియజేస్తూ,వారి సందేహాలను నివృత్తి చేయాలని కోరుతున్నారు.

ప్రభుత్వ సహకారంతోనే మెరుగైన వైద్యం:
వనస్థలిపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సూపరింటెండెంట్ చేస్తున్న ప్రయత్నాలకు రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన సహకారం అందించాలని ప్రజలు కోరుతున్నారు. వైద్య సిబ్బంది, నర్సింగ్ సిబ్బంది, మందులు,వైద్య పరికరాలు,బెడ్లు,పారిశుద్ధ్య నిర్వహణ,తాగునీరు వంటి మౌలిక సదుపాయాల కొరత లేకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించి,ఆసుపత్రిలో అవసరమైన సౌకర్యాలను సమకూర్చాలని కోరుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడంతోపాటు,రోగులను కుటుంబ సభ్యులుగా భావించి మానవీయమైన సేవలు అందించేలా వైద్య సిబ్బందికి తగిన సూచనలు ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు.రోగులకు నాణ్యమైన వైద్యం అందించడం, వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించడం, కనీస సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ ఆసుపత్రుల ప్రధాన లక్ష్యంగా ఉండాలి. వనస్థలిపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై సంబంధిత అధికారులు స్పందించి,అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు

కుల వివక్షను ప్రోత్సహించే కార్యక్రమాలపై చర్యలు తీసుకోవాలి

ప్రభుత్వానికి న్యాయవాది సుంకర నరేష్ వినతి



హైదరాబాద్,(ప్రజావినికిడి): నవంబర్ 24,
కుల పేర్లు,కుల గుర్తింపు చిహ్నాలు, కులాన్ని సూచించే నినాదాలతో బహిరంగంగా కుల గుర్తింపును ప్రచారం చేయడాన్ని నియంత్రించేందుకు తెలంగాణ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ప్రముఖ న్యాయవాది, సామాజిక కార్యకర్త సుంకర నరేష్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కులం పేరుతో నిర్వహించే సమావేశాలు, ర్యాలీలు, సమూహ సమావేశాలతో పాటు కార్తీక మాసంలో నిర్వహించే కుల ఆధారిత వన భోజనాలపైనా నియంత్రణ విధించాలని కోరారు. రాజ్యాంగంలోని సమానత్వం, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయం వంటి విలువలకు అనుగుణంగా సమాజ నిర్మాణం జరగాలని తన వినతి పత్రంలో పేర్కొన్నారు. కొంత మంది వ్యక్తులు, సంస్థలు కులాల పేర్లతో బహిరంగ సమావేశాలు నిర్వహించడం, ప్రైవేటు వాహనాలపై కుల పేర్లు,పదాలు, గుర్తింపు చిహ్నాలను ప్రదర్శించడం ద్వారా కులతత్వాన్ని ప్రోత్సహిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా కార్తీక మాసంలో వన భోజనాల పేరుతో కుల సంఘాలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూ,కుల గుర్తింపులను బహిరంగంగా ప్రదర్శిస్తున్నాయని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పోలీసు రికార్డులు, ప్రథమ సమాచార నివేదికల్లో ఎఫ్ఐఆర్‌లు కులానికి సంబంధించిన వివరాలను నమోదు చేసే విధానాన్ని కూడా ప్రభుత్వం తక్షణం రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ ఉన్నతాధికారులు కుల ఆధారిత కార్యక్రమాలకు హాజరయ్యే అంశంపై కూడా తగిన మార్గదర్శకాలు రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా సమానత్వం, గౌరవం, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయాన్ని పరిరక్షించేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం, గుజరాత్ ప్రభుత్వాలు ఈ విధంగా ఉత్తర్వులు జారీ చేశాయని గుర్తు చేసారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

తెలంగాణ మహిళలకు చిలకపచ్చ చీరలు..

నవంబర్ 26న తెలంగాణలో ప్రారంభం కానున్న ఇందిరమ్మ చీరల పంపిణీ

నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో పథకాన్ని ప్రారంభించనున్న సీఎం రేవంత్ రెడ్డి

రేషన్ కార్డు కలిగిన 18 ఏళ్లు పైబడిన కోటి మంది మహిళలకు లబ్ధి

నవంబర్ 24(ప్రజావినికిడి):



రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన మహిళలకు 'ఇందిరమ్మ చీరల' పంపిణీ చేపట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. రాజ్యాంగ దినోత్సవమైన నవంబర్ 26న నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. 'ఇందిరా మహిళా శక్తి' పథకంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు కోటి మంది మహిళలకు రామచిలుక రంగు (ప్యారెట్ గ్రీన్) చీరలను అందించనున్నారు.

ఆహార భద్రత లేదా రేషన్ కార్డు కలిగిన కుటుంబాల్లోని 18 ఏళ్లకు పైబడిన మహిళలను ఈ పథకానికి లబ్ధిదారులుగా ప్రభుత్వం ఎంపిక చేసింది. ఇందులో గ్రామీణ ప్రాంతాలకు చెందిన 65 లక్షల మంది, పట్టణ ప్రాంతాలకు చెందిన 35 లక్షల మంది మహిళలు ఉన్నారు. మొత్తం కోటి చీరల్లో 6.30 మీటర్ల పొడవు కలిగిన పాలిస్టర్ చీరలు 95 లక్షలు కాగా, 9 మీటర్ల పొడవు ఉండే పాలీ-కాటన్ చీరలు 5 లక్షలు ఉన్నాయి. స్థానిక చేనేత రంగాన్ని ప్రోత్సహించడంతో పాటు సిరిసిల్ల తదితర ప్రాంతాల్లోని నేత కార్మికులకు చేతినిండా పని కల్పించే ఉద్దేశంతో ఈ చీరల తయారీ బాధ్యతలను వారికి అప్పగించారు.

ఈ పంపిణీ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రత్యేక మొబైల్ యాప్‌ను వినియోగిస్తున్నారు. అర్హులైన మహిళలు తమ గ్రామాలు, వార్డుల్లోని పంపిణీ కేంద్రాల వద్ద రేషన్ కార్డు, ఆధార్ వివరాలను సమర్పించి చీరలను తీసుకోవచ్చు. వాస్తవానికి ఈ కార్యక్రమాన్ని నవంబర్ 19న ప్రారంభించాలని తొలుత నిర్ణయించినప్పటికీ, అనివార్య కారణాలతో నవంబర్ 26కు రీషెడ్యూల్ చేశారు. జిల్లా కలెక్టర్లు, జిల్లాల ఇన్‌ఛార్జ్ మంత్రుల పర్యవేక్షణలో ఈ పంపిణీ ప్రక్రియ రాష్ట్రవ్యాప్తంగా కొనసాగనుంది.

తన సహాయకుడి అకాల మరణం పట్ల కేసీఆర్ దిగ్భ్రాంతి



రాజన్న సిరిసిల్ల(ప్రజావినికిడి):

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తన వ్యక్తిగత సహాయకుడు మహేందర్ రెడ్డి మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మహేందర్ రెడ్డి రాజన్న సిరిసిల్ల జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందడం తెలిసిందే. అతడి మృతికి ప్రగాఢ సంతాపం తెలియజేస్తూ, వారి కుటుంబానికి పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని కేసీఆర్ భరోసా ఇచ్చారు.

మహేందర్ రెడ్డి మరణవార్త తెలియగానే కేసీఆర్ తీవ్ర ఆవేదనకు లోనయ్యారు. వెంటనే అంత్యక్రియల ఏర్పాట్లను దగ్గరుండి చూసుకోవాలని మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్‌ను ఆదేశించారు. అధినేత ఆదేశాల మేరకు సంతోష్ కుమార్.. ఇతర పార్టీ నేతలు, కేసీఆర్ వ్యక్తిగత సిబ్బందితో కలిసి మహేందర్ రెడ్డి స్వగ్రామమైన బందనకల్‌కు చేరుకున్నారు. అక్కడ మహేందర్ రెడ్డి పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

అనంతరం జరిగిన అంతిమయాత్రలో సంతోష్ కుమార్ స్వయంగా పాడె మోశారు. మహేందర్ రెడ్డితో తనకున్న వ్యక్తిగత అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. శోకసంద్రంలో మునిగిపోయిన కుటుంబ సభ్యులను ఆయన ఓదార్చి ధైర్యం చెప్పారు.

ఈ అంత్యక్రియల కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మాజీ ఎంపీపీ జనగామ శరత్ రావు, నేతలు అంజిరెడ్డి, జుబేర్, కేసీఆర్ వ్యక్తిగత కార్యదర్శి (పీఎస్) నాగేందర్ రెడ్డితో పాటు పలువురు కార్యాలయ సిబ్బంది, స్థానిక పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తొలి రోజు అయ్యప్ప స్వాములకు అన్నదానం చేసిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్





షాద్‌నగర్,(ప్రజావినికిడి):పట్టణంలోని వినాయక్ గంజ్‌లో హరిహర సుతన్ శ్రీ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాముల కోసం ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ప్రారంభమైంది. షాద్‌నగర్ ఎమ్మెల్యే,రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని శ్రీశ్రీశ్రీ గిరీష్ నాయర్ గురుస్వామితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నప్రసాద వితరణలో పాల్గొన్నారు.అయ్యప్ప స్వాములకు స్వయంగా అన్నప్రసాదం వడ్డించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అయ్యప్ప స్వాములకు అన్నదానం చేయడం ఎంతో పవిత్రమైన కార్యక్రమమని,భక్తిభావంతో పాటు సేవా దృక్పథాన్ని చాటే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడంఅభినందనీయమని అన్నారు. అయ్యప్ప స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని,ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్,వైస్ చైర్మన్ అందె మోహన్ తోపాటు కౌన్సిలర్లు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,అయ్యప్ప భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

కార్తీక పౌర్ణమి సందర్భంగా సోమేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి





ఎల్బీనగర్,(ప్రజావినికిడి):

బి.ఎన్.రెడ్డి నగర్ పరిధిలోని బి.యన్ రెడ్డి నగర్ కాలనీ శ్రీ కాశీ అన్నపూర్ణ సమేత సోమేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఈ రోజు కార్తీక పౌర్ణమి పర్వదిన వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా బి.ఎన్. రెడ్డి నగర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి ఆలయాన్ని సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా లచ్చి రెడ్డి గారు మాట్లాడుతూ,"పవిత్రమైన కార్తీక పౌర్ణమి రోజున శ్రీ కాశీ అన్నపూర్ణ సమేత సోమేశ్వర స్వామి వారిని దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని..ఆ పరమశివుని కృపాకటాక్షాలతో డివిజన్ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యాలతో తులతూగాలని మరియు ప్రతి ఒక్కరి జీవితంలో కార్తీక దీపాల వెలుగులు నిండాలని కోరారు

గెలిస్తే ఖర్చుల వసూళ్ల వేట..

ఓడితే అప్పుల ఊబిలో బతుకు పోరాటం!

సర్పంచ్ ఎన్నికల్లో ఆర్థిక పోటీకి బలవుతున్న సామాన్యులు..- గెలిచినవారికి పెట్టుబడి తిరిగి రాబట్టుకోవాలనే ఆరాటం.- ఓడినవారికి పెరుగుతున్న వడ్డీల భారం

నవంబర్ 24(ప్రజావినికిడి):



గ్రామానికి సేవ చేయాలనే ఆశయంతో రాజకీయాల్లోకి అడుగుపెడుతున్న సామాన్యులకు ఎన్నికలు క్రమంగా ఆర్థిక భారంగా మారుతున్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. సర్పంచ్ పదవి అంటే ఒకప్పుడు గ్రామాభివృద్ధికి అవకాశం, ప్రజలకు సేవ చేసే బాధ్యత. ఇప్పుడు కొన్ని గ్రామాల్లో ఎన్నికల పోటీ లక్షల రూపాయల ఖర్చు, ఆర్థిక స్థోమత, వ్యక్తిగత ప్రతిష్ఠ చుట్టూ తిరుగుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. గెలిచిన అభ్యర్థులు ఎన్నికల్లో పెట్టిన ఖర్చును ఎలాగైనా తిరిగి రాబట్టుకోవాలనే ఆలోచనలో పడుతున్నారనే విమర్శలు వినిపిస్తుండగా, ఓడిపోయిన అభ్యర్థులు మాత్రం అప్పులు తీర్చలేక, వడ్డీలు కట్టలేక దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారనే ఆవేదన వ్యక్తమవుతోంది.

గెలిచినంత మాత్రాన లాభమా?

ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థికి గ్రామంలో గౌరవం, పదవి, అధికారిక బాధ్యతలు దక్కుతాయి. అయితే ఎన్నికల సమయంలో చేసిన ఖర్చును తిరిగి సంపాదించుకోవాలనే ఆలోచన ప్రజాప్రతినిధి బాధ్యతలపై ప్రభావం చూపితే అసలు సమస్య మొదలవుతుంది. గ్రామ పంచాయతీ నిధులు ప్రజల సొమ్ము. అవి వ్యక్తిగత పెట్టుబడిని తిరిగి రాబట్టుకునే మార్గం కాదు. అభివృద్ధి పనుల పేరుతో నాణ్యతకు తిలోదకాలిచ్చినా, పనుల్లో అక్రమాలకు పాల్పడినా, కాంట్రాక్టర్లతో కుమ్మక్కైనా చట్టపరమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ప్రతి రూపాయికి లెక్క చెప్పాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉంటుంది.

ఓడిన అభ్యర్థులకు అప్పులే మిగులు!

ఎన్నికల్లో గెలుపోటములు సహజం. గెలిచినవారికి పదవి దక్కుతుంది. ఓడినవారికి మాత్రం చేసిన ఖర్చు, తెచ్చిన అప్పులు, వాటిపై పెరుగుతున్న వడ్డీలు మిగులుతున్నాయి. కొందరు వ్యవసాయ భూములు తాకట్టు పెట్టి, మరికొందరు బంగారం కుదువపెట్టి, ఇంకొందరు ప్రైవేటు వ్యక్తుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి ఎన్నికల్లో పోటీ చేస్తున్నారనే చర్చ గ్రామీణ ప్రాంతాల్లో వినిపిస్తోంది. ఫలితాలు వెలువడిన తర్వాత రాజకీయ సందడి తగ్గిపోతుంది. ప్రచారానికి వచ్చినవారు దూరమవుతారు. అప్పు ఇచ్చినవారు మాత్రం గడువు గుర్తు చేస్తారు. రోజురోజుకూ పెరుగుతున్న వడ్డీలు కుటుంబ ఆర్థిక పరిస్థితిని దెబ్బతీస్తున్నాయి. అప్పుల ఒత్తిడితో కుటుంబ సభ్యుల మధ్య మనస్పర్థలు, మానసిక ఆందోళనలు ఏర్పడే ప్రమాదం కూడా ఉంది.

సేవ చేయాలా.. ఖర్చు సంపాదించుకోవాలా?

సర్పంచ్ పదవి గ్రామ ప్రజలు అప్పగించే బాధ్యత. అది ఎన్నికల్లో పెట్టిన డబ్బును తిరిగి సంపాదించుకునే వ్యాపారం కాదు. ఎన్నికల ఖర్చును రాబట్టుకోవాలనే ఆలోచనతో అధికారాన్ని ఉపయోగించుకుంటే గ్రామాభివృద్ధి వెనుకబడటమే కాకుండా ప్రజాధనం దుర్వినియోగమయ్యే ప్రమాదం ఉంది. నిధుల వినియోగం, పనుల మంజూరు, బిల్లుల చెల్లింపులు, అభివృద్ధి పనుల నాణ్యత వంటి అంశాల్లో పారదర్శకత తప్పనిసరి. నిబంధనలకు విరుద్ధంగా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసినట్లు తేలితే సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవచ్చు.

ప్రజాస్వామ్యంలో పోటీకి డబ్బే అర్హతా?

గ్రామస్థాయిలో ప్రజాస్వామ్యానికి పునాది సర్పంచ్ ఎన్నికలు. పేదలు, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన సేవాభావం ఉన్నవారు కూడా పోటీ చేసే అవకాశం ఉండాలి. ఎన్నికల్లో డబ్బు ప్రభావం పెరిగితే ప్రజాసేవ చేయాలనుకునే నిజాయితీపరులు వెనుకడుగు వేసే పరిస్థితి ఏర్పడుతుంది. డబ్బు ఖర్చు చేయగలిగిన వారికే రాజకీయ అవకాశాలు పరిమితమైతే ప్రజాస్వామ్య స్ఫూర్తికే విఘాతం కలుగుతుంది. ఎన్నికల ఖర్చులకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన పరిమితులు, ఖర్చుల లెక్కల నిర్వహణ, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు కచ్చితంగా జరగాలి. ఓటర్లను ప్రలోభపెట్టడం, డబ్బు లేదా ఇతర ప్రయోజనాలు అందించి ఓట్లు పొందడం వంటి చర్యలు చట్టపరమైన సమస్యలకు దారితీస్తాయి.

వ్యవస్థ స్పందించాల్సిన సమయం!

ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల ఆర్థిక పరిస్థితులపై సమాజం కూడా ఆలోచించాలి. ఎన్నికల ఖర్చులపై నిఘా పెంచడం, అభ్యర్థులు సమర్పించే ఖర్చుల వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించడం, ఓటర్లను ప్రలోభపెట్టే చర్యలను అడ్డుకోవడం అధికార యంత్రాంగం బాధ్యత. ఎన్నికల తర్వాత కూడా గ్రామ పంచాయతీల్లో ఆర్థిక లావాదేవీలపై సామాజిక తనిఖీలు, గ్రామసభల ద్వారా ప్రజలకు సమాచారం అందుబాటులో ఉండాలి.

చివరికి మిగిలేది పదవా.. అప్పులా?

ఒక ఎన్నికలో గెలిచిన వ్యక్తి ఐదేళ్లపాటు ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. ఓడిపోయిన వ్యక్తి కూడా తన కుటుంబాన్ని అప్పుల నుంచి బయటపడేసుకోవాల్సి ఉంటుంది. గెలిచినవారు పెట్టిన ఖర్చును ప్రజాధనంతో పూడ్చుకోవాలనే ఆలోచనకు తావివ్వకూడదు. ఓడినవారు అప్పుల ఊబిలో కూరుకుపోయే పరిస్థితి రాకుండా ఎన్నికల సంస్కరణలపై చర్చ జరగాలి. గ్రామానికి సేవ చేయాలనే తపనతో ఎన్నికల్లోకి రావాలే తప్ప, ఆర్థికంగా నాశనమయ్యే పరిస్థితిని కొని తెచ్చుకోవద్దు. సర్పంచ్ పదవి ప్రజల విశ్వాసానికి ప్రతీక కావాలి. పెట్టుబడిపై లాభాలు ఆశించే వేదిక కాకూడదు. ప్రజాస్వామ్యంలో గెలుపు ఓటములు తాత్కాలికం. అప్పుల భారం మాత్రం ఒక కుటుంబాన్ని ఏళ్ల తరబడి వెంటాడుతుంది. ఈ వాస్తవాన్ని రాజకీయ నాయకులు, అధికారులు, ఓటర్లు ఇప్పటికైనా గుర్తించాల్సిన అవసరం ఉంది.

ఘనంగా గురునానక్ జయంతి వేడుకలు





ఎల్బీనగర్,(ప్రజావినికిడి): నవంబర్ 24,

557వ, గురునానక్ జయంతి వేడుకలు వనస్థలిపురంలోని గురుద్వార్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఎంతో భక్తీ శ్రద్ధలతో పాల్గొని భజనలు కీర్తనలు చేశారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం ఆటోనగర్‌లకు చెందిన భక్తులు భక్తిశ్రద్ధలతో గురు నానక్ జయంతిని జరుపుకున్నారు. ఉదయం శబద్ కీర్తనలు, భజనలు నిర్వహించగా, అనంతరం సామూహిక ప్రసాద వితరన చేశారు.సాయంత్రం కీర్తనలు, భజనలు మరియు లంగర్‌తో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. గురుద్వార్ అధ్యక్షులు రచ్ పాల్ సింగ్ కలాస అన్నారు.గురు నానక్ దేవ్ జీ యొక్క ఆశీస్సులు అందరికి కలిగి సంతోషంగా ఉండాలన్నారు.వినయం సేవాభావంతో జీవితాన్ని గడపాలని గురుణానక్ సందేశమని వనస్థలిపురం గురుద్వార్ అధ్యక్షులు రచ్ పాల్ సింగ్ అన్నారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షులు రచ్ పాల్ సింగ్ కలాస,ప్రధాన కార్యదర్శి జగ్జీవన్ సింగ్,ఉపాధ్యక్షుడు రాజేందర్ సింగ్,కార్యదర్శి కుల్వన్త్ సింగ్,ట్రెజరర్ గురిందర్ సింగ్, జాయింట్ ట్రెజరర్ అవతార్ సింగ్,జాయింట్ ట్రెజరర్ సందీప్ సింగ్,సభ్యులు మేజర్ సింగ్ జండూ,సభ్యులు రంజిత్ సింగ్ సందు,సభ్యులు తల్విందర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

భారత్‌లో భారీ ఉద్యోగ కోతల వార్తలను ఖండించిన గూగుల్..

'సుమారు 30 పోస్టులే తొలగింపు'

నవంబర్ 24(ప్రజావినికిడి):



భారత్‌లో తమ ఉద్యోగులను భారీగా తొలగిస్తున్నట్లు సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలను టెక్ దిగ్గజం గూగుల్ ఖండించింది. క్లౌడ్ విభాగంలో చేపట్టిన సంస్థాగత మార్పుల కారణంగా గత వారం కేవలం 30 మందిని మాత్రమే విధుల నుంచి తొలగించినట్లు సంస్థ స్పష్టం చేసింది.ఎక్స్, బ్లైండ్ వంటి సామాజిక మాధ్యమ వేదికల్లో గూగుల్ ఇండియా క్లౌడ్ విభాగం నుంచి భారీగా ఉద్యోగాల కోత జరుగుతోందంటూ గత కొన్ని రోజులుగా ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో గూగుల్ క్లౌడ్ ఇండియా తన అధికారిక 'ఎక్స్' ఖాతా ద్వారా స్పందించింది. "ఈ వదంతులు పూర్తిగా అవాస్తవం. కార్యకలాపాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా గత వారం భారత్‌లో ఒక చిన్న సంస్థాగత మార్పు జరిగింది. దీనివల్ల సుమారు 30 మంది ఉద్యోగులు మాత్రమే ప్రభావితమయ్యారు" అని ఆ పోస్ట్‌లో పేర్కొంది.ఏయే విభాగాల్లో ఈ తొలగింపులు చోటుచేసుకున్నాయనే వివరాలను గూగుల్ వెల్లడించలేదు. అమెరికా తర్వాత గూగుల్‌కు అత్యధిక సంఖ్యలో ఉద్యోగులు ఉన్న దేశాల్లో భారత్ ఒకటి. ముఖ్యంగా గూగుల్ క్లౌడ్ విభాగంలో ఇక్కడ వేలాది మంది విధులు నిర్వర్తిస్తున్నారు.ప్రస్తుతం టెక్ పరిశ్రమలో ఉద్యోగుల సర్దుబాటుపై విస్తృత చర్చ జరుగుతున్నప్పటికీ, ఈ తొలగింపులు చాలా పరిమితమని సంస్థ తెలిపింది. మరోవైపు, తమ కెరీర్స్ వెబ్‌సైట్ ప్రకారం ఇంజినీరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సేల్స్ వంటి విభాగాల్లో కొత్త నియామకాలను యథాతథంగా కొనసాగిస్తున్నట్లు గూగుల్ స్పష్టం చేసింది. సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వదంతులను కొందరు గూగుల్ ఉద్యోగులు సైతం 'నకిలీ ప్రచారం'గా కొట్టిపారేశారు.

జనసేనకు జై కొట్టిన వైసీపీ.

వైసీపీ మద్దతుతో నిడదవోలు వైస్ ఛైర్మన్ పదవిని దక్కించుకున్న జనసేన

పాత్తు ఒప్పందాన్ని ఉల్లంఘించారంటూ టీడీపీ నిరసన

విషయంపై మంత్రి దుర్గేష్‌ను వివరణ కోరిన పవన్ కల్యాణ్

ఆమరణ నిరాహార దీక్ష చేస్తానన్న టీడీపీ నేత శేషారావు



నిడదోలు నవంబర్ 24(ప్రజావినికిడి):

తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మున్సిపాలిటీలో మిత్రపక్షాలైన జనసేన, టీడీపీ మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. గతంలో కుదిరిన ఒప్పందాన్ని ఉల్లంఘించి, వైస్ ఛైర్మన్ పదవిని వైసీపీ సభ్యుల మద్దతుతో జనసేన కైవసం చేసుకుంది. సోమవారం జరిగిన ఎన్నికల్లో జనసేన కౌన్సిలర్ కళ్యాణ చక్రవర్తి, టీడీపీ అభ్యర్థి కొమ్మిన వెంకటేశ్వరరావుపై విజయం సాధించారు.అంతకుముందు, జనసేనకు చెందిన మున్సిపల్ ఛైర్‌పర్సన్ మురళా జ్యోతితో పాటు 32 మంది వార్డు కౌన్సిలర్లు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం నిర్వహించిన వైస్ ఛైర్మన్ ఎన్నికల్లో నాలుగో వార్డు కౌన్సిలర్ కళ్యాణ చక్రవర్తికి 18 ఓట్లు రాగా, టీడీపీ అభ్యర్థికి 13 ఓట్లు లభించాయి. జనసేనకు చెందిన 15 మందితో పాటు బీజేపీకి చెందిన ఒకరు, వైసీపీకి చెందిన ఇద్దరు కౌన్సిలర్లు చక్రవర్తికి మద్దతు తెలపడం గమనార్హం.

ఇటీవల జరిగిన ఎన్నికల్లో మొత్తం 32 వార్డులకు గాను జనసేన 14, టీడీపీ 13, వైసీపీ 3, బీజేపీ 1, ఒక స్వతంత్ర అభ్యర్థి విజయం సాధించారు. ముందస్తు ఒప్పందం ప్రకారం ఛైర్మన్ పదవి జనసేనకు, వైస్ ఛైర్మన్ పదవి టీడీపీకి దక్కాల్సి ఉంది. ఈ పరిణామాలపై టీడీపీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి కందుల దుర్గేశ్ హామీ ఇచ్చినప్పటికీ జనసేన నేతలు మాట తప్పారని టీడీపీ సీనియర్ నాయకులు, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావు ఆరోపించారు. ఒప్పందాన్ని గౌరవించకపోతే ఆమరణ నిరాహార దీక్షకు దిగుతానని ఆయన హెచ్చరించారు. ఈ అంశాన్ని పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన పేర్కొన్నారు.

కాగా, స్వయంగా మంత్రి దుర్గేశ్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే ఇలాంటి పరిస్థితులు తలెత్తడంపై జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. దీనిపై మంత్రిని ఆయన వివరణ కోరగా, స్థానిక నేతలతో చర్చించి పార్టీ అధిష్ఠానం నిర్ణయాన్ని అమలు చేస్తానని మంత్రి స్పష్టం చేశారు. ఎన్నిక ఫలితాలు వెలువడిన అనంతరం టీడీపీకి చెందిన 13 మంది కౌన్సిలర్లు సభ నుంచి వాకౌట్ చేశారు.

రేణిగుంట ఆంజనేయస్వామి ఆలయం తొలగింపుపై రాజకీయ దుమారం.. ఆలయ పూజారి వివరణ

శాస్త్రోక్తంగా విగ్రహాలను పక్కనే ప్రతిష్ఠించాకే పాత కట్టడాన్ని తొలగించారన్న పూజారి

గ్రామస్థుల సమ్మతితోనే తరలింపు జరిగిందని వివరణ

ఈ భూసేకరణ ప్రక్రియ 2023లోనే ప్రారంభమైందన్న దేవాదాయ శాఖ

తిరుపతి నవంబర్ 24:(ప్రజావినికిడి):



తిరుపతి జిల్లా రేణిగుంట మండలం ఆంజనేయపురంలోని అభయ ఆంజనేయ స్వామి ఆలయ పాత కట్టడం తొలగింపు వ్యవహారంపై కూటమి ప్రభుత్వం, వైసీపీ మధ్య తీవ్ర స్థాయి వాదోపవాదాలు చోటుచేసుకున్నాయి. కడప-రేణిగుంట జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా ఈ పురాతన ఆలయాన్ని కూల్చివేశారంటూ వైసీపీ ఆరోపించగా... విగ్రహాలను శాస్త్రోక్తంగా కొత్త ప్రాంగణంలోకి మార్చిన అనంతరమే పాత నిర్మాణాన్ని తొలగించినట్లు ఆలయ పూజారి, దేవాదాయ శాఖ స్పష్టం చేశాయి.ఆలయ కూల్చివేతను ఖండిస్తూ వైసీపీ అధినేత జగన్ 'ఎక్స్' వేదికగా విమర్శలు గుప్పించారు. కూటమి ప్రభుత్వంలో పురాతన ఆలయాన్ని బుల్డోజర్లతో కూల్చివేయడం భక్తుల విశ్వాసాలను దెబ్బతీయడమేనని ఆరోపించారు. టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి స్థానికంగా నిరసన తెలుపుతూ రహదారి అలైన్‌మెంట్‌ను మార్చే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని పేర్కొన్నారు. మరోవైపు, వైఎస్సార్సీపీ చేస్తున్న ఆరోపణలను ఖండిస్తూ తెలుగుదేశం పార్టీ తమ అధికారిక 'ఎక్స్' ఖాతాలో ఆలయ పూజారి మాట్లాడిన వీడియోను పోస్ట్ చేసింది. అందులో పూజారి మాట్లాడుతూ, గ్రామస్థులు, భక్తులు, దేవాదాయ శాఖ అధికారుల పూర్తి సమ్మతితోనే పూజలు జరిపి విగ్రహాలను పక్కనే నిర్మించిన కొత్త ఆలయంలోకి ప్రతిష్ఠించామని తెలిపారు. ఆ తర్వాతే పాత కట్టడాలను తొలగించారని, భక్తులు తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఈ వివాదంపై ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, సంబంధిత అధికారులు వివరణ ఇచ్చారు. జాతీయ రహదారి నాలుగు లేన్ల విస్తరణ కోసం ఆలయానికి చెందిన 10 సెంట్ల స్థలాన్ని సేకరించే ప్రక్రియ 2023లో గత ప్రభుత్వ హయాంలోనే ప్రారంభమైందని అధికారులు వెల్లడించారు. ఆలయానికి ప్రత్యామ్నాయంగా సమీపంలోనే 50 సెంట్ల భూమిని కేటాయించామని, అలాగే రూ.59.30 లక్షల పరిహారాన్ని 2026 ఆగస్టు 1వ తేదీన ఆలయ ఈవో ఖాతాలో జమ చేశామని దేవాదాయ శాఖ స్పష్టం చేసింది.

ఆస్తులు తీసుకొని తల్లిదండ్రులను రోడ్డున పడేస్తే మూడేళ్ల జైలు : కేరళం సీఎం సంచలన నిర్ణయం



నవంబర్ 24:(ప్రజావినికిడి):

తల్లిదండ్రుల నుంచి ఆస్తులు రాయించుకుని, ఆ తర్వాత వారిని పట్టించుకోకుండా గాలికొదిలేసే పిల్లలకు కేరళం ప్రభుత్వం గట్టి హెచ్చరిక జారీ చేసింది. అలాంటి బాధ్యతారహిత సంతానానికి ఏకంగా మూడేళ్ల జైలు శిక్ష విధించేలా కొత్త చట్టాన్ని తీసుకొచ్చినట్లు కేరళం ముఖ్యమంత్రి వి.డి. సతీశన్ సంచలన ప్రకటన చేశారు. సీనియర్ సిటిజన్ల సంరక్షణ, హక్కుల పరిరక్షణ కోసం రాష్ట్ర అసెంబ్లీ అక్టోబర్‌లో ఆమోదించిన నూతన బిల్లులో ఈ కీలక నిబంధనను చేర్చినట్లు స్పష్టం చేశారు. కొల్లం సమీపంలోని పతనపురంలో గల గాంధీభవన్‌లో రూ.20 కోట్ల వ్యయంతో వృద్ధుల కోసం అత్యాధునిక వసతులతో నిర్మించిన 'పితృమందిరం' నివాస సముదాయాన్ని ప్రారంభించిన సందర్భంగా ఈ వివరాలు వెల్లడించారు.యూడీఎఫ్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తీసుకున్న తొలి నిర్ణయం వృద్ధుల సంక్షేమం కోసం ప్రత్యేక శాఖను ఏర్పాటు చేయడమేనని సీఎం గుర్తుచేశారు. దేశంలోనే ఇలాంటి శాఖను నెలకొల్పిన తొలి రాష్ట్రం కేరళం అని పేర్కొన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా వయోవృద్ధులకు పలు విశేష హక్కులను కల్పిస్తూ సమగ్ర చట్టాన్ని తెచ్చామని వివరించారు. గవర్నర్ ఆమోదం లభించి ఈ చట్టం పూర్తిస్థాయిలో అమల్లోకి రాగానే, తల్లిదండ్రులను మోసం చేసే పిల్లలను కచ్చితంగా జైలుకు పంపుతామని, ఇందులో ఎలాంటి సందేహం అవసరం లేదని గట్టిగా చెప్పారు.

పిల్లలను పెంచి పెద్ద చేయడానికి తల్లిదండ్రులు ఎంతటి కష్టాలు, త్యాగాలు భరిస్తారో సమాజం తెలుసుకోవాలని సతీశన్ ఉద్వేగంగా మాట్లాడారు. ఎదిగి పెద్ద స్థాయికి చేరిన తర్వాత కన్నవారిని అనాథలుగా వదిలేసే సంస్కృతి కేరళంలో ఉండకూడదని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులను గుండెలకు హత్తుకుని చూసుకునే సరికొత్త సంస్కృతి సమాజంలో రావాలని, రాష్ట్రంలో ఏ ఒక్క వృద్ధుడూ ఒంటరి కాకూడదన్నదే తన ఆశయమని తెలిపారు. కాగా, ఈ పితృమందిరం నిర్మాణానికి పూర్తి ఆర్థిక సాయం అందించిన లులు గ్రూప్ ఛైర్మన్ ఎం.ఎ.యూసుఫ్ అలీని సీఎం కొనియాడారు. ఎంత సంపద ఉన్నా ఇతరులకు సాయం చేసే గొప్ప గుణం ఆయనకు ఉందని ప్రశంసించారు.

తగ్గని ద్రవ్యోల్బణం.. వడ్డీ రేట్ల పెంపు తప్పదన్న ఫెడ్ అధికారి

నవంబర్ 24:(ప్రజావినికిడి):



అమెరికా సెంట్రల్ బ్యాంక్ అయిన ఫెడరల్ రిజర్వ్, డిసెంబర్‌లో జరిగే సమావేశంలో వడ్డీ రేట్లను పెంచే అవకాశాలు బలంగా కనిపిస్తున్నాయి. న్యూయార్క్ ఫెడరల్ రిజర్వ్ అధ్యక్షుడు జాన్ విలియమ్స్ చేసిన తాజా వ్యాఖ్యలు ఈ అంచనాలకు బలం చేకూరుస్తున్నాయి. దేశంలో ద్రవ్యోల్బణం ఇంకా ఆందోళనకర స్థాయిలో ఉండటంతో, కఠిన ద్రవ్య విధానం అవసరమని ఆయన స్పష్టం చేశారు.

ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ, ద్రవ్యోల్బణం ఇప్పటికీ "చాలా ఎక్కువగా" ఉందని విలియమ్స్ పేర్కొన్నారు. దానిని ఫెడ్ లక్ష్యమైన రెండు శాతానికి తీసుకురావడానికి ఇంకా చాలా సమయం పడుతుందని అంగీకరించారు. 2026 చివరి నాటికి ద్రవ్యోల్బణం 3.5 శాతం వద్ద స్థిరపడవచ్చని, 2028 నాటికి గానీ 2 శాతం లక్ష్యాన్ని చేరుకోలేమని ఆయన అంచనా వేశారు. అవసరమైతే, వరుస సమావేశాల్లోనూ వడ్డీ రేట్లను పెంచే అవకాశాన్ని తోసిపుచ్చలేమని స్పష్టం చేశారు. అయితే, ఇది ముందుగా నిర్ణయించుకున్న మార్గం కాదని, భవిష్యత్తులో వచ్చే ఆర్థిక గణాంకాల (డేటా) ఆధారంగానే తుది నిర్ణయాలు ఉంటాయని వివరించారు.

ప్రస్తుతం అమెరికా ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందని, 2026, 2027 సంవత్సరాల్లో వృద్ధి రేటు సుమారు 2.75 శాతంగా నమోదు కావొచ్చని విలియమ్స్ తెలిపారు. ప్రస్తుతం 4.1 శాతంగా ఉన్న నిరుద్యోగ రేటు, వచ్చే ఏడాది 4%కి తగ్గే అవకాశం ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇంధన ధరలు, టారిఫ్‌లు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు వంటి అంశాలు ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపుతాయని ఆయన పేర్కొన్నారు.

ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ (ఎఫ్‌ఓఎంసీ) తదుపరి సమావేశం డిసెంబర్ 8, 9 తేదీల్లో జరగనుంది. ప్రస్తుతం ఫెడ్ ఫండ్స్ వడ్డీ రేటు 3.75 శాతం 4.00 శాతం పరిధిలో ఉంది. ఈ సమావేశంలో ఫెడ్ 25 బేసిస్ పాయింట్ల (0.25 శాతం) పెంపును ప్రకటించవచ్చని మార్కెట్ వర్గాలు బలంగా అంచనా వేస్తున్నాయి. ఇతర ఫెడ్ అధికారులు కూడా ఇటీవల ఇదే తరహా అభిప్రాయాలను వ్యక్తం చేయడంతో విలియమ్స్ వ్యాఖ్యలకు ప్రాధాన్యం సంతరించుకుంది.

పాంక్రియాటిక్ క్యాన్సర్‌కు మాత్ర.. క్లినికల్ ట్రయల్స్‌లో సంచలన ఫలితాలు

పాంక్రియాటిక్ క్యాన్సర్‌పై ప్రభావవంతంగా పనిచేస్తున్న సరికొత్త మాత్ర

ముదిరిన దశలోని క్యాన్సర్ రోగుల జీవన కాలాన్ని రెట్టింపు చేసిన ఔషధం

దాదాపు 90 శాతం మంది రోగుల్లో నిలిచిపోయిన కణితి పెరుగుదల

కీమోథెరపీతో కలిపి ఇవ్వడం వల్ల మరింత మెరుగైన ఫలితాలు

కేఆర్ఏఎస్ జన్యు మార్పులను నియంత్రించి క్యాన్సర్‌ను అడ్డుకునే విధానం

నవంబర్ 24:(ప్రజావినికిడి):



వైద్య రంగంలో అత్యంత ప్రమాదకరమైనదిగా భావించే పాంక్రియాటిక్ (క్లోమ గ్రంథి) క్యాన్సర్ చికిత్సలో సరికొత్త ఆశాకిరణం వెలుగుచూసింది. రెవల్యూషన్ మెడిసిన్స్ సంస్థ అభివృద్ధి చేసిన 'దరాక్సాన్‌రాసిబ్' (మార్కెట్ పేరు రాసోంక్) అనే సరికొత్త మాత్ర క్లినికల్ ట్రయల్స్‌లో అద్భుతమైన ఫలితాలను కనబరుస్తోంది. ప్యాంక్రియాటిక్ క్యాన్సర్ రోగులకు ఈ ఔషధం సంజీవనిలా పనిచేస్తోందని పరిశోధకులు వెల్లడించారు.

సాధారణంగా పాంక్రియాటిక్ క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తించడం చాలా కష్టం. ఈ క్యాన్సర్ బారిన పడిన వారిలో మరణాల రేటు అత్యధికంగా దాదాపు 98 శాతంగా ఉంటోంది. వ్యాధి నిర్ధారణ జరిగిన తర్వాత రోగులు కొద్ది నెలలు మాత్రమే జీవించగలుగుతారు. ఇలాంటి క్లిష్టమైన పరిస్థితుల్లో, రోజువారీగా తీసుకునే ఈ మాత్ర ఆయుష్షును పెంచడంలో కీలక పాత్ర పోషిస్తోంది. గతంలో నిర్వహించిన ఫేజ్-3 ట్రయల్స్‌లో, వ్యాధి తీవ్రత పెరిగిన రోగుల సగటు జీవన కాలాన్ని ఇది 6.6 నెలల నుంచి ఏకంగా 13.2 నెలలకు పెంచింది. రోగుల ఆయుష్షు దాదాపు రెట్టింపు కావడంతో అమెరికా ఔషధ నియంత్రణ సంస్థ ఇప్పటికే దీనికి ఆమోదం తెలిపింది.

తాజాగా బార్సిలోనాలో నిర్వహించిన వైద్య సదస్సులో ఈ ఔషధానికి సంబంధించిన ఫేజ్ 1/2 ట్రయల్స్ ఫలితాలను పరిశోధకులు సమర్పించారు. కొత్తగా క్యాన్సర్ నిర్ధారణ అయిన రోగులకు కీమోథెరపీతో కలిపి డరాక్సాన్‌రాసిబ్ మాత్రను మొదటి దశ చికిత్సగా అందించారు. ఇందులో అనూహ్యమైన ఫలితాలు వెలుగుచూశాయి. చికిత్స తీసుకున్న వారిలో దాదాపు 90 శాతం మందిలో కణితి పెరుగుదల పూర్తిగా నిలిచిపోయింది. సుమారు 60 శాతం మంది రోగుల్లో కణితులు గణనీయంగా కుంచించుకుపోవడమో లేదా పూర్తిగా కనుమరుగవ్వడమో జరిగింది. అంతేకాకుండా, ప్రతి 12 మందిలో ఒకరికి (సుమారు 8 శాతం మందికి) స్కానింగ్ పరీక్షల్లో క్యాన్సర్ ఆనవాళ్లు కూడా పూర్తిగా కనిపించకుండా పోవడం విశేషం.

ఈ ఔషధం పనిచేసే విధానం కూడా ఎంతో ప్రత్యేకమైనది. మెజారిటీ పాంక్రియాటిక్ క్యాన్సర్లు 'కేఆర్ఏఎస్' అనే జన్యు ఉత్పరివర్తనాల (మ్యుటేషన్లు) కారణంగా వస్తాయి. శరీర కణాల పెరుగుదలను నియంత్రించే స్విచ్ లాగా ఈ కేఆర్ఏఎస్ ప్రొటీన్ పనిచేస్తుంది. అయితే మ్యుటేషన్ జరగడం వల్ల ఆ స్విచ్ నిరంతరం 'ఆన్' మోడ్‌లోనే ఉండిపోయి, క్యాన్సర్ కణాలు నియంత్రణ లేకుండా పెరిగిపోతాయి. దరాక్సాన్‌రాసిబ్ ఈ లోపభూయిష్టమైన ప్రొటీన్లను లక్ష్యంగా చేసుకుని, ఆ స్విచ్‌ను 'ఆఫ్' చేసి కణాల ఎదుగుదలను అడ్డుకుంటుంది.

సాధారణ కీమోథెరపీతో పోలిస్తే ఈ మాత్ర వల్ల సైడ్ ఎఫెక్ట్స్ తక్కువగా ఉండటంతో పాటు రోగులు ఎక్కువ కాలం జీవించేందుకు దోహదపడుతోందని నిపుణులు పేర్కొంటున్నారు. అయితే, ఈ ఔషధం వల్ల వ్యాధి పూర్తిగా నయమవుతుందా లేదా దీని ప్రభావం ఎంత కాలం కొనసాగుతుంది అనే విషయాలపై మరింత స్పష్టత రావాల్సి ఉంది. అయినప్పటికీ, ఇప్పటివరకు ఎదురైన సవాళ్లను అధిగమిస్తూ వచ్చిన ఈ ప్రాథమిక ఫలితాలు క్యాన్సర్ చికిత్సారంగంలో ఒక సరికొత్త విప్లవానికి నాంది పలికాయని వైద్య నిపుణులు భావిస్తున్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

వైభవ్ విధ్వంసం.. క్రికెట్ చరిత్రలో సరికొత్త అధ్యాయం

53 బంతుల్లో 204 పరుగులు.. 28 సిక్సర్లతో ప్రపంచ రికార్డు.. ఇండియా ఏ జట్టుకు సెమీఫైనల్ బెర్తు



భారత క్రికెట్‌లో మరో యువ సంచలనం ఆవిర్భవించాడు. చిన్న వయసులోనే తన అసాధారణ ప్రతిభతో ప్రపంచ క్రికెట్ దృష్టిని ఆకర్షిస్తున్న వైభవ్ సూర్యవంశీ మరోసారి చరిత్ర సృష్టించాడు. ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టోర్నీలో యూఏఈతో జరిగిన మ్యాచ్‌లో విధ్వంసకర బ్యాటింగ్‌తో పరుగుల వరద పారించాడు. కేవలం 53 బంతుల్లోనే 204 పరుగులు సాధించి లిస్ట్-ఏ క్రికెట్‌లో సరికొత్త ప్రపంచ రికార్డులు నెలకొల్పాడు. అతడి అద్భుత ఇన్నింగ్స్ కారణంగా ఇండియా ఏ జట్టు ఏడు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి సెమీఫైనల్‌కు అర్హత సాధించింది.దోహాలో జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన యూఏఈ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 249 పరుగులు చేసింది. ఆ జట్టు బ్యాటర్ హర్‌ప్రీత్ సింగ్ భాటియా అద్భుతంగా ఆడి 144 బంతుల్లో 130 పరుగులు సాధించాడు. అతడి ఇన్నింగ్స్‌లో 12 ఫోర్లు, నాలుగు సిక్సర్లు ఉన్నాయి. భారత బౌలర్లలో అర్షద్ ఖాన్ నాలుగు వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి జట్టు భారీ స్కోరు సాధించకుండా అడ్డుకున్నాడు.250 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన ఇండియా ఏ జట్టుకు వైభవ్ సూర్యవంశీ అదిరిపోయే ఆరంభాన్ని అందించాడు. ఆరంభం నుంచే ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడుతూ బౌండరీల వర్షం కురిపించాడు. కేవలం 16 బంతుల్లో అర్ధశతకం, 28 బంతుల్లోనే శతకం పూర్తి చేశాడు. దీంతో లిస్ట్-ఏ క్రికెట్‌లో అత్యంత వేగంగా సెంచరీ సాధించిన ఆటగాడిగా ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. గతంలో ఆస్ట్రేలియా ఆటగాడు జేక్ ఫ్రేజర్ మెక్‌గర్క్ 29 బంతుల్లో సాధించిన సెంచరీ రికార్డును అధిగమించాడు. అంతటితో ఆగకుండా మరింత దూకుడుగా ఆడిన వైభవ్ 40 బంతుల్లో 150 పరుగులు పూర్తి చేశాడు. అనంతరం కేవలం 52 బంతుల్లోనే ద్విశతకాన్ని అందుకుని మరో ప్రపంచ రికార్డు సృష్టించాడు. గతంలో న్యూజిలాండ్‌కు చెందిన చాడ్ బోవ్స్ 103 బంతుల్లో సాధించిన అత్యంత వేగవంతమైన ద్విశతక రికార్డును బద్దలుకొట్టాడు. మొత్తంగా 53 బంతుల్లో 204 పరుగులు చేసిన వైభవ్ ఇన్నింగ్స్‌లో ఏడు ఫోర్లు, 28 సిక్సర్లు ఉన్నాయి. లిస్ట్-ఏ క్రికెట్‌లో ఒకే ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన ఆటగాడిగా కూడా రికార్డు నెలకొల్పాడు.వైభవ్ విధ్వంసంతో ఇండియా ఏ జట్టు కేవలం 14.2 ఓవర్లలోనే మూడు వికెట్లు కోల్పోయి 254 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది. రింకూ సింగ్ చివర్లో సిక్సర్ బాది జట్టుకు విజయాన్ని ఖరారు చేశాడు. లక్ష్యాన్ని ఇంత తక్కువ సమయంలో ఛేదించడం కూడా లిస్ట్-ఏ క్రికెట్‌లో అరుదైన ఘనతగా నిలిచింది. ఈ విజయంతో ఇండియా ఏ జట్టు గ్రూప్-బిలో అగ్రస్థానాన్ని సాధించి సెమీఫైనల్ బెర్తును ఖరారు చేసుకుంది.కేవలం 15 ఏళ్ల వయసులోనే వైభవ్ సాధిస్తున్న విజయాలు భారత క్రికెట్ భవిష్యత్తుపై కొత్త ఆశలు కలిగిస్తున్నాయి. ఇప్పటికే ఐపీఎల్‌లో తన బ్యాటింగ్ ప్రతిభతో గుర్తింపు తెచ్చుకున్న అతడు, అంతర్జాతీయ స్థాయిలోనూ తన సత్తా చాటుతున్నాడు. ఒత్తిడికి లోనుకాకుండా ప్రత్యర్థి బౌలర్లను ఎదుర్కొనే విధానం, బంతిని బలంగా బాదే సామర్థ్యం అతడిలోని ప్రత్యేకతను చాటుతున్నాయి.అయితే యువ ఆటగాడిగా వైభవ్‌పై భారీ అంచనాలు పెరుగుతున్న నేపథ్యంలో అతడికి సరైన శిక్షణ, అనుభవం, మార్గదర్శకత్వం అందించడం అవసరం. ఒక్క ఇన్నింగ్స్‌తోనే ఆటగాడి భవిష్యత్తును నిర్ణయించలేం. ప్రతిభతో పాటు నిలకడ, క్రమశిక్షణ, శారీరక దృఢత్వం కూడా అత్యంత ముఖ్యం. భారత క్రికెట్ నియంత్రణ మండలి, జట్టు యాజమాన్యం అతడి ఎదుగుదలకు తగిన ప్రణాళిక రూపొందించాలి.వైభవ్ సూర్యవంశీ ఇన్నింగ్స్ కేవలం ఒక మ్యాచ్ విజయం మాత్రమే కాదు.. భారత క్రికెట్‌లో యువ ప్రతిభ ఏ స్థాయిలో ఉందో ప్రపంచానికి చాటిచెప్పిన ఘట్టం. రికార్డులు బద్దలుకొడుతూ దూసుకెళ్తున్న ఈ యువ ఆటగాడు భవిష్యత్తులో మరిన్ని అద్భుతాలు సృష్టించాలని అభిమానులు ఆశిస్తున్నారు.

బంతిపై ఉమ్మి నిషేధం కొనసాగింపు

- **గిల్ విజ్ఞప్తిని పట్టించుకోని ఐసీసీ.. బౌలర్లకు నిరాశ..**

నిబంధనల మార్పునకు ఇప్పట్లో అవకాశం లేనట్టే!



క్రికెట్‌లో బౌలర్లకు అనుకూలంగా ఉండే బంతి మెరుపును కాపాడుకోవడం ఎంతో కీలకం. ముఖ్యంగా టెస్టు క్రికెట్‌లో పాత బంతితో రివర్స్ స్వింగ్ సాధించాలంటే ఒకవైపు మెరుపును కొనసాగించడం అవసరం. ఇందుకోసం గతంలో బౌలర్లు బంతికి ఉమ్మిని ఉపయోగించేవారు. అయితే కరోనా మహమ్మారి సమయంలో ఆటగాళ్లు, అంపైర్ల ఆరోగ్య భద్రత దృష్ట్యా అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఈ పద్ధతిపై నిషేధం విధించింది. కరోనా ప్రభావం తగ్గినప్పటికీ ఆ నిషేధాన్ని కొనసాగించడం ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఈ నిబంధనను తొలగించాలని కోరినా ఐసీసీ మాత్రం వెనక్కి తగ్గడం లేదు.ఇటీవల న్యూజిలాండ్‌తో వెల్లింగ్టన్‌లో జరిగిన తొలి టెస్టు డ్రాగా ముగిసిన అనంతరం గిల్ ఈ అంశాన్ని ప్రస్తావించాడు. భారత జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 720 పరుగుల భారీ స్కోరు సాధించినప్పటికీ న్యూజిలాండ్ బ్యాటర్లను రెండో ఇన్నింగ్స్‌లో పూర్తిగా ఆలౌట్ చేయలేకపోయింది. చివరి రోజు భారత బౌలర్లు తీవ్రంగా శ్రమించినా ప్రత్యర్థి బ్యాటర్లు వికెట్లు కోల్పోకుండా పోరాడారు. దీంతో మ్యాచ్ ఫలితం తేలకుండా ముగిసింది. ఈ పరిస్థితుల్లో బంతి త్వరగా మెత్తబడటం, బౌలర్లకు ఆశించిన స్థాయిలో సహకారం లభించకపోవడంపై గిల్ అసంతృప్తి వ్యక్తం చేశాడు.ముఖ్యంగా కూకబురా బంతి 25 నుంచి 30 ఓవర్లకే మెత్తబడుతోందని గిల్ పేర్కొన్నాడు. బంతి నాణ్యత, పిచ్ పరిస్థితులు బౌలర్లకు అనుకూలంగా లేకపోతే వికెట్లు తీయడం మరింత కష్టమవుతుందని అభిప్రాయపడ్డాడు. గతంలో కరోనా కారణంగా ఉమ్మి వినియోగంపై నిషేధం విధించారని, ఇప్పుడు ఆ పరిస్థితులు లేనందున నిబంధనను పునఃపరిశీలించాలని కోరాడు. బంతిని మెరిపించేందుకు ఉమ్మిని ఉపయోగించే అవకాశం కల్పిస్తే బౌలర్లకు కొంత ప్రయోజనం ఉంటుందని సూచించాడు.అయితే గిల్ విజ్ఞప్తిపై ఐసీసీ సానుకూలంగా స్పందించలేదు. ప్రస్తుతం ఉమ్మి నిషేధాన్ని ఎత్తివేసే ఆలోచన లేదని స్పష్టం చేసినట్లు సమాచారం. 2020లో కరోనా మహమ్మారి సమయంలో తాత్కాలికంగా ప్రారంభమైన ఈ నిషేధాన్ని రెండేళ్ల తర్వాత శాశ్వత నిబంధనగా మార్చారు. మేరిల్‌బోన్ క్రికెట్ క్లబ్ (ఎంసీసీ) క్రికెట్ చట్టాలకు అనుగుణంగా బంతి స్వభావాన్ని అన్యాయంగా మార్చే చర్యగా ఉమ్మి వినియోగాన్ని పరిగణిస్తున్నారు.ఉమ్మిని ఉపయోగించేటప్పుడు కొందరు ఆటగాళ్లు స్వీట్లు, చూయింగ్‌గమ్, మింట్స్ వంటి పదార్థాలను కలిపే అవకాశం ఉందని ఐసీసీ భావిస్తోంది. దీనివల్ల బంతి పరిస్థితిని కృత్రిమంగా మార్చే ప్రమాదం ఉండటంతో పాటు, మైదానంలో ఈ విధానాన్ని పర్యవేక్షించడం కూడా కష్టమవుతుందని చెబుతోంది. ఆటగాళ్లు, అంపైర్ల ఆరోగ్య భద్రతకు సంబంధించిన అంశాలను కూడా ఐసీసీ పరిగణనలోకి తీసుకుంటోంది. అందువల్ల ప్రస్తుత నిబంధనలను కొనసాగించడానికే మొగ్గుచూపుతోంది.

టీ20లో ప్రియాంశ్ ఆర్య విధ్వంసం

- **68 బంతుల్లో 181 పరుగులు.. 19 సిక్సర్లతో రికార్డుల మోత**



టీ20 క్రికెట్‌లో ఢిల్లీ యువ సంచలనం ప్రియాంశ్ ఆర్య పరుగుల సునామీ సృష్టించాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో తమిళనాడుతో జరిగిన మ్యాచ్‌లో కేవలం 68 బంతుల్లోనే 181 పరుగులు చేసి చరిత్ర సృష్టించాడు. అతడి ఇన్నింగ్స్‌లో 19 సిక్సర్లు, ఏడు ఫోర్లు ఉన్నాయి. కేవలం 36 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసి ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపించాడు.ఈ అద్భుత ఇన్నింగ్స్‌తో టీ20 క్రికెట్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన భారత ఆటగాడిగా నిలిచాడు. గతంలో కేఎల్ రాహుల్ (152 నాటౌట్) పేరిట ఉన్న రికార్డును అధిగమించాడు. అంతేకాకుండా ఒకే ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన ఫిన్ అలెన్ (19) ప్రపంచ రికార్డును సమం చేశాడు.ఆర్య విధ్వంసకర బ్యాటింగ్‌తో ఢిల్లీ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 275 పరుగుల భారీ స్కోరు సాధించింది. ప్రపంచ టీ20 క్రికెట్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోర్ల జాబితాలో 181 పరుగులతో రెండో స్థానానికి చేరుకున్నాడు. దక్షిణాఫ్రికా ఆటగాడు లువాన్-డ్రే ప్రిటోరియస్ 188 పరుగుల రికార్డుకు చేరువగా వచ్చి ఔటయ్యాడు. యువ ఆటగాడి అసాధారణ బ్యాటింగ్ క్రికెట్ అభిమానులను ఆశ్చర్యపరిచింది.

పాఠాలు ఎగ్గొట్టి.. క్రికెట్ మ్యాచ్‌కు!

భారత్‌న్యూజిలాండ్ టెస్టును చూసేందుకు విద్యార్థుల పరుగులు.. కెమెరా కంటపడగానే ముఖాలు దాచుకున్న వైనం వైరల్



క్రికెట్‌పై అభిమానం ఏ స్థాయిలో ఉంటుందో చాటిచెప్పే సరదా ఘటన భారత్‌న్యూజిలాండ్ టెస్టు మ్యాచ్‌లో చోటుచేసుకుంది. పాఠశాలకు వెళ్లాల్సిన విద్యార్థులు తరగతులను ఎగ్గొట్టి ఏకంగా క్రికెట్ మ్యాచ్ చూసేందుకు మైదానానికి చేరుకున్నారు. అయితే మ్యాచ్‌ను ఆస్వాదిస్తున్న సమయంలో స్టేడియం కెమెరా వారి వైపు తిరగడంతో అసలు విషయం బయటపడింది. కెమెరాలో కనిపించకుండా ముఖాలు దాచుకుంటూ, తలలు వంచుకుంటూ వారు చేసిన ప్రయత్నం అందరినీ నవ్వించింది. న్యూజిలాండ్‌లోని వెల్లింగ్టన్ బేసిన్ రిజర్వ్ మైదానంలో భారత్‌న్యూజిలాండ్ మధ్య జరిగిన తొలి టెస్టు చివరి రోజు ఈ ఘటన చోటుచేసుకుంది. పాఠశాల యూనిఫాంలో ఉన్న ముగ్గురు విద్యార్థులు ప్రేక్షకుల మధ్య కూర్చొని మ్యాచ్‌ను ఆస్వాదిస్తున్నారు. చివరి రోజు ప్రేక్షకులకు ఉచిత ప్రవేశం కల్పించడంతో వారు ఈ అవకాశాన్ని వినియోగించుకున్నట్లు తెలుస్తోంది.ఇంతలో ప్రత్యక్ష ప్రసారం చేస్తున్న కెమెరా విద్యార్థుల వైపు మళ్లింది. తమను కెమెరా చిత్రీకరిస్తోందని గుర్తించిన వెంటనే వారు ముఖాలు దాచుకుంటూ కనిపించకుండా ప్రయత్నించారు. ఈ దృశ్యాలు ప్రత్యక్ష ప్రసారంలో రావడంతో వ్యాఖ్యాతలు కూడా సరదాగా స్పందించారు. సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్ ఈ వీడియోను సామాజిక మాధ్యమాల్లో పంచుకోవడంతో వైరల్‌గా మారింది. 'పిల్లలు ఎక్కడున్నారో వారి తల్లిదండ్రులకు తెలిసిపోయింది' అంటూ సోనీ లివ్ సరదా వ్యాఖ్యను జతచేసింది.తర్వాత మీడియాతో మాట్లాడిన విద్యార్థులు తాము పాఠశాల నుంచి తప్పించుకుని మ్యాచ్ చూసేందుకు వచ్చినట్లు వెల్లడించారు. ఈ ఘటనకు పాఠశాల యాజమాన్యం తేలికపాటి శిక్షగా చెత్తను శుభ్రం చేసే పనిని అప్పగించినట్లు తెలిపారు. తల్లిదండ్రుల స్పందన మాత్రం ఒక్కొక్కరిది ఒక్కోలా ఉంది. కొందరు నవ్వుకోగా, మరికొందరు అసంతృప్తి వ్యక్తం చేశారు.మైదానంలో మ్యాచ్ డ్రాగా ముగిసినా, విద్యార్థుల కెమెరా ఘటన మాత్రం అభిమానులకు ప్రత్యేక వినోదాన్ని పంచింది. క్రికెట్‌పై చిన్నారులకు ఉన్న ఆసక్తిని ఈ సంఘటన మరోసారి చాటిచెప్పింది.

దక్షిణాఫ్రికా పేసర్ల ధాటికి బంగ్లాదేశ్ విలవిల

91 పరుగులకే కుప్పకూలిన బంగ్లా జట్టు.. రబడా, జాన్సెన్ చెరో మూడు వికెట్లతో చెలరేగుడు



సెంచూరియన్: దక్షిణాఫ్రికా పేసర్లు నిప్పులు చెరిగే బంతులతో బంగ్లాదేశ్ బ్యాటింగ్ ఆర్డర్‌ను కుప్పకూల్చారు. సూపర్‌స్పోర్ట్ పార్క్‌లో జరుగుతున్న రెండో టెస్టు తొలి రోజు బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 91 పరుగులకే ఆలౌటైంది. దక్షిణాఫ్రికా బౌలర్లు కట్టుదిట్టమైన బంతులతో ప్రత్యర్థి బ్యాటర్లను క్రీజులో నిలవనివ్వలేదు.టాస్ గెలిచిన దక్షిణాఫ్రికా తొలుత బౌలింగ్ ఎంచుకుంది. వర్షం కారణంగా ఆట ఆలస్యంగా ప్రారంభమైనప్పటికీ బౌలర్లు తమ ఆధిపత్యాన్ని చాటారు. బంగ్లాదేశ్ బ్యాటర్లలో మహ్‌ఫిజుల్ ఇస్లాం 23, మొమినుల్ హక్ 18, తౌహిద్ హృదయ్ 19 పరుగులు చేశారు. మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. 33.3 ఓవర్లలోనే బంగ్లాదేశ్ ఇన్నింగ్స్ ముగిసింది.దక్షిణాఫ్రికా బౌలర్లలో మార్కో జాన్సెన్ 17 పరుగులిచ్చి మూడు వికెట్లు, కగిసో రబడా 23 పరుగులిచ్చి మూడు వికెట్లు పడగొట్టారు. అన్రిచ్ నోర్జే రెండు వికెట్లతో రాణించాడు. ముఖ్యంగా నోర్జే వరుస బంతుల్లో మహ్‌ఫిజుల్, బంగ్లా కెప్టెన్ నజ్ముల్ హుస్సేన్ షాంటోను పెవిలియన్‌కు పంపాడు.అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన దక్షిణాఫ్రికా ఆట ముగిసే సమయానికి 17 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 88 పరుగులు చేసింది. ఐడెన్ మార్క్రమ్ 21 పరుగులకు ఔటవగా, మార్కస్ అకెర్‌మన్ 46, జుబేర్ హమ్జా 9 పరుగులతో క్రీజులో ఉన్నారు. దక్షిణాఫ్రికా ఇంకా మూడు పరుగుల వెనుకంజలో ఉంది. సెంచూరియన్ మైదానంలో టెస్టుల్లో నమోదైన అత్యల్ప తొలి ఇన్నింగ్స్ స్కోరుగా బంగ్లాదేశ్ 91 పరుగులు నిలిచింది.

ఎంత ట్యాలెంట్ చూపించినా రేసులో ఖాళీయే



అందం, అభినయం, అద్భుతమైన స్క్రీన్ ప్రెజెన్స్ ఉన్నా అదృష్టం కలిసిరాకపోతే సినీ పరిశ్రమలో నిలదొక్కుకోవడం ఎంత కష్టమో మాళవిక మోహనన్ కెరీర్‌ను చూస్తే అర్థమవుతుంది. మలయాళంలో –పట్టం పోలే– చిత్రంతో వెండితెరకు పరిచయమైన ఈ బ్యూటీ ఆ తర్వాత ప్రఖ్యాత దర్శకుడు మజీద్ మజీదీ తెరకెక్కించిన –బియాండ్ ది క్లౌడ్స్– సినిమాలో తన నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకుంది. అనంతరం రజనీకాంత్ పేట, విజయ్ మాస్టర్, ధనుష్ మారన్, విక్రమ్ తంగలాన్ వంటి భారీ చిత్రాల్లో స్టార్ హీరోల సరసన నటించే అవకాశం దక్కించుకుని దక్షిణాదిలో మంచి గుర్తింపు తెచ్చుకుంది. అయితే ఈ సినిమాలన్నీ ఈ భామకు గ్లామర్ పరంగా, నటన పరంగా పేరు తెచ్చాయే తప్ప.. సోలోగా కెరీర్‌ను మలుపుతిప్పే భారీ కమర్షియల్ బ్లాక్‌బస్టర్లుగా నిలవలేకపోయాయి. ముఖ్యంగా ప్రభాస్ సరసన నటించిన ప్రతిష్టాత్మక చిత్రం –ది రాజా సాబ్– పై మాళవిక ఎన్నో ఆశలు పెట్టుకుంది. ఈ సినిమాతో టాలీవుడ్‌లో తిరుగులేని క్రేజ్ సంపాదించి.. వరుస అవకాశాలు అందుకుంటుందని అందరూ భావించారు. కానీ బాక్సాఫీస్ వద్ద –రాజా సాబ్– ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడం.. నాశిరకం కంటెంట్ ఆరోపణలతో మాళవిక కెరీర్‌పై తీవ్ర ప్రభావం చూపింది. ఆ సినిమా ఫ్లాప్ కావడంతో తెలుగులో తనకు సరైన అవకాశాలు రాకుండా పోయాయి. టాలీవుడ్ అగ్ర హీరోల సరసన ఛాన్సులు దక్కకపోవడంతో పాటు.. కోలీవుడ్‌లోనూ ఆశించిన పెద్ద అవకాశాలు తగ్గిపోయాయి. ప్రస్తుతం మాళవిక మోహనన్ చేతిలో చెప్పుకోదగ్గ ప్రాజెక్టులేవీ లేవు. తమిళంలో కార్తీ సరసన నటించిన –సర్దార్ 2– తో పాటు... ప్రస్తుతం త్యాగరాజన్ కుమారరాజా దర్శకత్వంలో విజయ్ సేతుపతి హీరోగా తెరకెక్కుతున్న –పాకెట్ నావెల్– అనే ఒకే ఒక్క సినిమాలో నటిస్తోంది. అటు తెలుగు, తమిళ ఇండస్ట్రీల్లోని పెద్ద హీరోలు తనకు అవకాశాలు ఇవ్వకపోగా.. ఇటు బాలీవుడ్‌లోనూ –యుద్రా– తర్వాత కొత్త ఆఫర్లు ఏవీ తలుపు తట్టడం లేదు. ఎంత టాలెంట్ చూపించినా.. గ్లామర్ ఒలకబోసినా స్టార్ హీరోయిన్ల రేసులో మాళవిక పూర్తిగా వెనకబడిపోయింది. కేవలం సక్సెస్‌ను మాత్రమే నమ్మే సినీ పరిశ్రమలో ఒక భారీ హిట్ ఇస్తేనే ప్రతిదీ దక్కుతుంది. కానీ ఆ కీలకమైన విజయం మాళవిక మోహనన్‌కు అందనంత దూరంలో ఉండిపోయింది. అద్భుతమైన ప్రతిభ– కష్టపడే తత్వం ఉన్నా అదృష్టం కలిసిరాకపోవడంతో కెరీర్ ఆశించిన వేగంతో ముందుకు సాగడం లేదు. కనీసం త్వరలో రానున్న –పాకెట్ నావెల్– అయినా బ్రేక్ ఇచ్చి.. మళ్లీ బిజీ హీరోయిన్‌గా మారుస్తుందో లేదో చూడాలి.



‘ఇది నా అడ్డా’ అంటున్న చిరంజీవి..

ఆసక్తికరంగా ‘మెగావర్స్‘ టాక్ షో ప్రోమో!

దాదాపు ఐదు దశాబ్దాల పాటు వెండితెరపై ప్రేక్షకులను అలరిస్తున్న మెగాస్టార్ చిరంజీవి, ఇప్పుడు సరికొత్త అవతారంలోకి మారుతున్నారు. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ ‘నెట్‌ఫ్లిక్స్‘ కోసం ఆయన ఒక టాక్ షోకు హోస్ట్‌గా వ్యవహరించనున్నారు. ‘చిరంజీవిన్ మెగావర్స్’ పేరుతో రానున్న ఈ షోకు సంబంధించిన ఆసక్తికరమైన ప్రోమోను నెట్‌ఫ్లిక్స్ నేడు విడుదల చేసింది. ‘ఇది నా అడ్డా’ అంటూ చిరంజీవి తనదైన శైలిలో చెప్పిన డైలాగ్ ఈ షోపై అంచనాలను పెంచుతోంది.ప్రోమోలో చిరంజీవి పేరులోని ‘చీ’ అక్షరం మిస్ అవ్వడం, ఆయన తదుపరి అడుగు (చీవన్) ‘నెట్‌ఫ్లిక్స్‘ అని చెప్పకనే చెప్పింది. ఈ షోలో చిరంజీవి మునుపెన్నడూ చూడని విధంగా సరదాగా, చమత్కారంగా కనిపిస్తారని తెలుస్తోంది. సినిమా, క్రీడలు, పాప్యులర్ కల్చర్‌కు చెందిన ప్రముఖులతో ఆయన ముచ్చటించనున్నారు.

ఈ షోలో అతిథులుగా కమల్ హాసన్, నాగార్జున, ప్రభాస్, బ్రహ్మానందం, సందీప్ రెడ్డి వంగా, రవితేజ, నాని, బాబీ కొల్లి వంటి పలువురు స్టార్లు పాల్గొననున్నట్టు సమాచారం. గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్, ఆటమ్ మీడియా వెంచర్స్, సోల్ ప్రొడక్షన్ ఎల్ఎల్‌పీ సంస్థలు ఈ షోను నిర్మిస్తున్నాయి. నవంబర్ 30వ తేదీ సాయంత్రం 4:30 గంటల నుంచి ‘చిరంజీవిన్ మెగావర్స్’ నెట్‌ఫ్లిక్స్‌లో ప్రసారం కానుంది.మరోవైపు, సినిమాలతోనూ చిరంజీవి బిజీగా ఉన్నారు. ప్రస్తుతం ఆయన మల్లిడి వశిష్ఠ దర్శకత్వంలో ‘విశ్వంభర’ చిత్రంతో పాటు బాబీ కొల్లి దర్శకత్వంలో ‘కాకా’ అనే మరో సినిమా చేస్తున్నారు. ఈ చిత్రం 2027 జనవరి 13న విడుదల కానుంది.

‘ఆలోచన‘ ట్రైలర్‌ను విడుదల చేసిన చిరంజీవి..

కీలక పాత్రలో సుధాకర్ తనయుడు బెన్నీ

వృద్ధాప్య సమస్యలు, కుటుంబ సంబంధాలు, పెద్దల మనోభావాల నేపథ్యంతో తెరకెక్కిన సరికొత్త తెలుగు చిత్రం ‘ఆలోచన’. ఈ సినిమా అధికారిక థియేట్రికల్ ట్రైలర్‌ను మెగాస్టార్ చిరంజీవి నేడు విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్ర బృందానికి ఆయన శుభాకాంక్షలు తెలుపుతూ సినిమా మంచి విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఆలోచన చిత్రంలో సీనియర్ నటుడు సుధాకర్ తనయుడు బెన్నీ కీలక పాత్ర పోషిస్తుండడం విశేషం.ఈ చిత్రానికి సురేందర్ చాచా దర్శకత్వం వహించగా, ప్రదీప్ కుమార్ మరియు శ్రీనివాస్ గుండబోయిన సంయుక్తంగా నిర్మించారు. వియాన్ ఎస్.ఎ. సంగీతం సమకూర్చారు. సీనియర్ నటులు జి.వి. నారాయణరావు, నరసింహరాజు, ప్రసాద్ బాబు, మహర్షి రాఘవ, జయలలిత తదితరులు ప్రధాన పాత్రల్లో నటించారు. ట్రైలర్ ఆద్యంతం కుటుంబ అనుబంధాలు, నేటి సమాజంలో వృద్ధులు ఎదుర్కొంటున్న మానసిక సంఘర్షణలను హృద్యంగా ఆవిష్కరించినట్లు కనిపిస్తోంది.ఈ సినిమాకు సెన్సార్ బోర్డు ‘యు/ఎ సర్టిఫికెట్ మంజూరు చేసింది. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ‘ఆలోచన’ చిత్రం నవంబర్ 27న ప్రేక్షకుల ముందుకు రానుంది.ఈ సందర్భంగా చిత్ర యూనిట్ సీనియర్ సిటిజన్ల కోసం ఒక ప్రత్యేక నిర్ణయాన్ని ప్రకటించింది. 60 ఏళ్లు పైబడిన వారు సరైన గుర్తింపు కార్డును చూపించి, నవంబర్ 27, 28 మరియు 29 తేదీల్లో ఈ చిత్రాన్ని థియేటర్లలో ఉచితంగా వీక్షించవచ్చని నిర్మాతలు తెలిపారు. సమాజానికి ఒక మంచి సందేశాన్ని ఇచ్చే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చిత్ర బృందం పేర్కొంది. కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రంగా రూపొందిన ‘ఆలోచన’ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటుందని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు.కాగా, ఈ చిత్రంలో నటించిన ప్రసాద్ బాబు, నారాయణరావు.. చిరంజీవికి సన్నిహితులని తెలిసిందే. అంతేకాదు, యువ నటుడు బెన్నీ తండ్రి సుధాకర్ కూడా చిరంజీవికి సన్నిహితుడే.



శర్వానంద్‌తో వైరల్ ఫొటోపై డింపుల్ హయతి స్పందన



టాలీవుడ్ నటి డింపుల్ హయతి తన వైవాహిక జీవితంపై వస్తున్న ప్రచారానికి తెరదించారు. తనకు ఇంకా వివాహం కాలేదని ఆమె స్పష్టం చేశారు. శర్వానంద్ కథానాయకుడిగా రూపొందిన ‘భోగి’ సినిమా ప్రమోషన్లలో భాగంగా వీరిద్దరూ కలిసి ఉన్న ఫొటోలు వైరల్ కావడంతో, ఈ అంశంపై ఆమె క్లారిటీ ఇచ్చారు.హైదరాబాద్‌లో జరిగిన ‘భోగి’ చిత్ర ప్రీ రిలీజ్, ట్రైలర్ లాంచ్ వేడుకకు చిత్ర బృందం హాజరైంది. ఈ కార్యక్రమంలో శర్వానంద్ భుజంపై డింపుల్ హయతి చనువుగా తల వాల్చి నవ్వుతున్న ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వీటిని చూసిన ఒక నెటిజన్.. శర్వానంద్‌కు పెళ్లయినట్లే డింపుల్ హయతికి కూడా వివాహం జరిగిపోయింది కదా అంటూ కామెంట్ చేశాడు.

ఆ కామెంట్‌పై డింపుల్ హయతి నేరుగా స్పందిస్తూ... “నాకు ఇంకా పెళ్లి కాలేదు“ అంటూ నవ్వుతున్న ఎమోజీలతో సమాధానమిచ్చారు. గతంలో చోటుచేసుకున్న కొన్ని వివాదాల సమయంలో విక్టర్ డేవిడ్ అనే వ్యక్తిని ఆమె భర్తగా కొన్ని వార్తా కథనాల్లో పేర్కొన్నారు. దీంతో చాలామంది ఆమెకు పెళ్లయిపోయిందని భావించారు. తాజాగా డింపుల్ స్వయంగా స్పందించడంతో ఆ వదంతులకు ముగింపు పడింది.మరోవైపు, సంపత్ నంది దర్శకత్వంలో పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కిన ‘భోగి‘ చిత్రంలో శర్వానంద్, అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయతి ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ చిత్రం నవంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.

హైదరాబాద్‌లో ‘బిచ్చగాడు’ ఫేమ్ విజయ్ ఆంటోనీ సందడి : రోడ్డుపై బజ్జీలు, హోటల్లో బన్ మస్కా తింటూ హల్‌చల్!

రద్దీగా ఉండే హైదరాబాద్ వీధుల్లో ఒక స్టార్ హీరో రోడ్డు పక్కన బండి వద్ద నిలబడి స్వయంగా మిర్చి బజ్జీలు వేస్తూ కనిపిస్తే ఎలా ఉంటుంది? సరిగ్గా ఇలాంటి అరుదైన దృశ్యమే సోమవారం సాయంత్రం అమీర్‌పేటలో కనిపించి స్థానికులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేసింది. ‘బిచ్చగాడు’ చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు సుపరిచితుడైన కోలీవుడ్ కథానాయకుడు విజయ్ ఆంటోనీ నగరంలో సందడి చేశాడు. తన తాజా చిత్రం ‘నాన్న కుట్టి’ ప్రమోషన్స్ కోసం హైదరాబాద్ వచ్చిన అతడు, తన చిత్ర బృందంతో కలిసి అమీర్‌పేట ప్రాంతంలో సాధారణ వ్యక్తిలా కలియదిరిగాడు.నగర జీవన శైలిని దగ్గరగా పరిశీలిస్తూ చిరు వ్యాపారులను ఆప్యాయంగా పలకరించిన విజయ్ ఆంటోనీ, ఓ స్ట్రీట్ ఫుడ్ బండి వద్ద ఆగి వేడివేడి మిర్చి బజ్జీలను స్వయంగా వేసి అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఆ తర్వాత ఏషియన్ సత్యం మాల్ సమీపంలోని ఒక హోటల్‌కు వెళ్లి చాయ్ తాగుతూ, బన్ మస్కా రుచి చూశాడు. అక్కడ ఉన్న సామాన్యులతో ముచ్చటిస్తూ సరదాగా గడిపాడు.సుమారు అరగంటపాటు సాగిన ఈ పర్యటనతో స్థానికులు ఉత్సాహానికి లోనయ్యారు. తమ అభిమాన నటుడు రోడ్డుపైకి వచ్చాడని తెలుసుకున్న జనం అతడిని చూసేందుకు భారీగా తరలివచ్చారు. అతడితో ఫొటోలు, సెల్ఫీలు దిగేందుకు పోటీ పడటంతో ఆ ప్రాంతంలో పండుగ వాతావరణం నెలకొంది.



Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613